


Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 226 | శుక్రవారం 06 ఫిబ్రవరి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

irculated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# బొగ్గు గనిలో పేలుడు....

## - 16 మంది మృత్యువాత



షిల్లాంగ్ - సూర్య వాస్తవం

మేఘాలయలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. తాష్ఞె ప్రాంతంలోని ఓ బొగ్గు గనిలో గురువారం పేలుడు సంభవించడంతో, 16 మంది కార్మికులు మరణించారు. ఈ దుర్ఘటనతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. వార్తా సంస్థల కథనాల ప్రకారం, గని లోపల ఈ పేలుడు జరగడంతో కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా అసోం రాష్ట్రానికి చెందిన వలస కార్మికులుగా అధికారులు అనుమానిస్తున్నారు. వీరిలో ఒకరిని కటిగొరా ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మిగతా వారి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ దుర్ఘటన గురించి తెలియగానే మేఘాలయ పోలీసులు, సహాయక బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గనిలోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చేందుకు సహాయక చర్యలు ముమ్మరంగా

- మిగతా 2లో..



## బొగ్గు గని ప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి...

- మృతుల కుటుంబాలకు నష్ట పరిహారం
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ. 50 వేలు సాయం
- ఘటనపై సమగ్ర విచారణకు మేఘాలయ ప్రభుత్వం ఆదేశం
- బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసిన సీఎం సంగ్మా

2లో

## ఏపీ హైకోర్టులో అంబటి క్వాష్ పిటిషన్..



- తనపై నమోదైన కేసును కొట్టివేయాలని హైకోర్టును ఆశ్రయించిన అంబటి
- అంబటి రిమాండ్ చట్టవిరుద్ధమని వాదించిన ఆయన తరఫు న్యాయవాది
- పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులకు ఆదేశం - విచారణ 11వ తేదీకి వాయిదా - గుంటూరు కోర్టులో బెయిల్ పిటిషన్‌పై విచారణ రేపటికి వాయిదా

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## వైసీపీ హయాంలో చేసిన పనులకు బిల్లులు మేమే చెల్లిస్తాం

- ప్రతి ఎకరాకు నీరందించడమే లక్ష్యమని స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు
- సాగునీటి సంఘాలు చేపట్టే పనులకు జీఎస్టీ ఉండదని కీలక హామీ
- వైసీపీ ప్రభుత్వంలో పెండింగులో ఉన్న బిల్లులు కూడా చెల్లిస్తామని భరోసా
- పరుగెత్తే నీటిని నిలిపి భూగర్భ జలాలు పెంచాలని సంఘాలకు సూచన
- ప్రత్యామ్నాయ పంటలతో రైతుల ఆదాయం పెంచేలా చర్యలు తీసుకుంటామని వెల్లడి



విజయవాడ - సూర్య వాస్తవం

రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించే బాధ్యతను నీటి వినియోగ దారుల సంఘాలు తీసుకోవాలని ముఖ్య మంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. సాగునీటి సంఘాలు చేపట్టే పనులకు జీఎస్టీ లేకుండా చూస్తామని, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు సైతం బిల్లులు చెల్లించే బాధ్యత తమదేనని ఆయన కీలక హామీ ఇచ్చారు. గురువారం అమరావతిలో నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు, ప్రతినిధులతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "నీటి భద్రత

- మిగతా 2లో..



## తిరుమల లడ్డూ వ్యవహారంలో సీబీఐ ఎక్కడా క్లీన్ చిట్ ఇవ్వలేదు

- గత వైసీపీ ప్రభుత్వంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర ఆరోపణలు
- తిరుమల లడ్డూ ప్రసాదంలో నెయ్యికి బదులు పామాయిల్, రసాయనాలు వాడారని వ్యాఖ్య
- అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి కూడా లక్ష కల్తీ లడ్డూలు పంపారని ఆరోపణ
- గత ప్రభుత్వం దేవుడిపైనే పగబట్టిందని, ఇది హిందువుల మనోభావాలను దెబ్బతీయడమేనని విమర్శ
- ఈ వ్యవహారంలో ఎక్కడా సీబీఐ క్లీన్ చిట్ ఇవ్వలేదని, వాస్తవాలు బయటపెడతామని స్పష్టీకరణ

2లో

## కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను అరెస్టు చేయాలి

- బీజేపీకి రేవంత్ రెడ్డి డిమాండ్
- బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలది ఫెవికాల్ బంధమన్న ముఖ్యమంత్రి
- ఏపీలో అధికారం కోల్పోతామని తెలిసినా సోనియా తెలంగాణ ఇచ్చారని వ్యాఖ్య
- అసెంబ్లీకి రాని కేసీఆర్‌కు వేతనం కట్ చేయవద్దా అని ప్రశ్న



హైదరాబాద్ - సూర్య వాస్తవం

కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసులో కేసీఆర్, హరీశ్ రావును, ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లో కేటీఆర్‌ను అరెస్టు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలది ఫెవికాల్ బంధమని విమర్శించారు. బీఆర్ఎస్ అగ్ర నాయకులను అరెస్టు చేసిన తర్వాతనే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ నేతలు ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా గుమ్లాపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ, రాష్ట్రంలో 123 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లలో అభివృద్ధి పనులకు రెండేళ్లలో రూ. 17,442 కోట్లు ఖర్చు చేశామని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని సోనియా గాంధీ కరీంనగర్ గడ్డ నుంచే హామీ ఇచ్చి నెరవేర్చారని అన్నారు. ఏపీలో అధికారం కోల్పోయినా మాట



## జగన్‌కు విజయవాడ పోలీసుల నోటీసులు!

- రేపు మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటికి వైఎస్ జగన్
- విజయవాడలో రూట్ మార్చాలంటూ పోలీసులు నోటీసులు జారీ
- అంబటి పర్యటనకు వచ్చిన జనాన్ని చూసి ప్రభుత్వం కుట్ర చేస్తోందని వైసీపీ ఆరోపణ
- ముందే రూట్ మ్యాప్ ఇచ్చినా ఆంక్షలు విధించారంటూ ఆగ్రహం

2లో

## బొగ్గు గనిలో పేలుడు...

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగిస్తున్నాయి. మేఘాలయలో తరచూ జరుగుతున్న చట్టవిరుద్ధమైన 'ర్యాట్-హోల్' మైనింగ్ వల్లే ఇలాంటి ప్రమాదాలు పునరావృతం అవుతున్నాయని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు ప్రారంభమైంది. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

**రాష్ట్రపతి, ప్రధాని సంతాపం**

తూర్పు జైంటియా హిల్స్‌లో చోటుచేసుకున్న దురదృష్ట ఘటనలో కార్మికులు చనిపోవడం తీవ్ర బాధాకరమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఘటన పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చనిపోయిన కార్మికులకు సంతాపం ప్రకటించి, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పిఎంఎన్ఆర్ఎఫ్) నుంచి ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున పరిహారం, అలాగే గాయపడినవారికి ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున సాయం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

## బొగ్గు గని ప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి...

- మృతుల కుటుంబాలకు నష్ట పరిహారం
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ. 50 వేలు సాయం
- ఘటనపై సమగ్ర విచారణకు మేఘాలయ ప్రభుత్వం ఆదేశం
- బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసిన సీఎం సంగ్మా

**మేఘాలయ - సూర్య వాస్తవం**

మేఘాలయలోని ఈస్ట్ జైంతియా హిల్స్ జిల్లాలోని ఓ బొగ్గు గనిలో గురువారం భారీ పేలుడు సంభవించడంతో 16 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోవడం తెలిసిందే. ఈ దుర్ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబా లకు, క్షతగాత్రులకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఈ ఘటనపై సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ స్పందించారు. "ఈస్ట్ జైంతియా హిల్స్‌లో జరిగిన ప్రమాదం నన్ను కలచివేసింది. ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలి" అని పేర్కొన్నారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. ఈ ప్రమాదంపై మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా స్పందిస్తూ, ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించిందని తెలిపారు. బాధ్యులను గుర్తించి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ప్రజల భద్రత విషయంలో ఎలాంటి రాజీకి తావులేదని, విచారణలో తేలిన అంశాల ఆధారంగా అవసరమైన అన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈస్ట్ జైంతియా హిల్స్ జిల్లాలోని థాంగ్‌స్కూ ప్రాంతంలో ఉన్న అనుమానిత అక్రమ బొగ్గు గనిలో ఈ పేలుడు జరిగిందని పోలీసు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 16 మృతదేహాలను వెలికితీసినట్లు జిల్లా ఎస్పీ వికాశ్ కుమార్ ధ్రువీకరించారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని ఆయన వివరించారు.

## జగన్‌కు విజయవాడ పోలీసుల నోటీసులు!

- రేపు మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటికి వైఎస్ జగన్
- విజయవాడలో రూట్ మార్చాలంటూ పోలీసులు నోటీసులు జారీ
- అంబటి పర్యటనకు వచ్చిన జనాన్ని చూసి ప్రభుత్వం కుట్ర చేస్తోందని వైసీపీ ఆరోపణ
- ముందే రూట్ మ్యాప్ ఇచ్చినా ఆంక్షలు విధించారంటూ ఆగ్రహం

**విజయవాడ - సూర్య వాస్తవం**

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ విజయవాడ పర్యటనపై పోలీసులు ఆంక్షలు విధించారు. రేపు మాజీ మంత్రి జోగి రమేశ్ కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ సిద్ధమవుతున్న తరుణంలో, పర్యటన మార్గాన్ని మార్చాలని విజయవాడ పోలీసులు నోటీసులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే, జగన్ శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని జోగి రమేశ్ నివాసానికి వెళ్లాల్సి ఉంది. ఇందుకోసం తాడేపల్లి నుంచి కనకదుర్గ వారధి, ఫ్లైఓవర్ మీదుగా వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అయితే, పర్యటనకు ఒక రోజు ముందు విజయవాడ నగర పోలీస్ కమిషనర్ స్వయంగా ఈ మార్గంలో వెళ్లవద్దని, వేరే దారిలో వెళ్లాలని సూచిస్తూ నోటీసులు ఇచ్చినట్టు తెలుస్తోంది. ఇటీవల గుంటూరులో మాజీ మంత్రి అంబటి రాంబాబును పరామర్శించేందుకు జగన్ వెళ్లినప్పుడు భారీగా జనం తరలివచ్చారని, ఈ ప్రజా స్పందన చూసి కూటమి ప్రభుత్వం భయపడిందని వైసీపీ నేతలు అంటున్నారు. అందుకే ఇప్పుడు విజయవాడ పర్యటనను అడ్డుకునేందుకు కుట్రపూరితంగా ఆంక్షలు విధిస్తోందని వైఎస్సార్సీపీ వర్గాలు తీవ్రంగా ఆరోపిస్తున్నాయి. ముందస్తుగా సమాచారం ఇచ్చినా చివరి నిమిషంలో పోలీసులు మార్గాన్ని మార్చమంటున్నారని పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## వైసీపీ హయాంలో చేసిన పనులకు బిల్లులు మేమే చెల్లిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

అందరికీ అవసరం కానీ, దాని సంరక్షణపై చాలా మందికి శ్రద్ధ లేదు. పరుగెత్తే నీటిని నిలపాలి, నడిచే నీటిని జలాశయంగా మార్చాలి. అప్పుడే భూగర్భ జలాల మట్టం పెరుగుతుంది" అని సూచించారు. రాష్ట్రంలో ఉన్న 40 జీవనదుల నీటిని సమర్థవంతంగా వినియోగించుకుంటే కరవు అనే మాటే వినిపించదని ఆయన స్పష్టం చేశారు. ఒకప్పుడు రైతు ఆత్మహత్యలకు కేంద్రంగా ఉన్న రాష్ట్రాన్ని, ఇప్పుడు రైతులకు అనుకూలమైన రాష్ట్రంగా మారుస్తున్నామని తెలిపారు. సాగునీటి సంఘాలకు నామినేషన్ పద్ధతిలో పనులు అప్పగిస్తున్నందున, చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా చూడాల్సిన బాధ్యత వాటిపైనే ఉందని సీఎం దిశానిర్దేశం చేశారు. నీటి పన్నులు వసూలు చేసుకుని, ఆ నిధులతో కాలువల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టవచ్చని సూచించారు. రాష్ట్రంలో 6,700 నీటి వినియోగదారుల సంఘాలు, 58 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. ఖరీఫ్, రబీ సీజన్లకు సరైన సమయంలో నీరందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వరితో పాటు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించడం ద్వారా వారి ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రకృతి సేద్యానికి ప్రాధాన్యత ఇస్తూ, భూగర్భ జలాల పెంపు, కాలువలు, ప్రాజెక్టుల నిర్వహణలో సంఘాలు చురుకైన పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను అరెస్టు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

తప్పలేదని అన్నారు. ఏపీ పెట్టుబడి దారులు అడ్డుపడినా ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ ఇచ్చారని గుర్తు చేశారు. తెలంగాణను కాంగ్రెస్ ఇచ్చినప్పటికీ ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు పట్టం కట్టారని, కానీ ప్రజల ఆకాంక్షలను వారు నెరవేర్చలేకపోయారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి ప్రజాపాలన అందిస్తుంటే తమపై కొంతమంది విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోవాలని ఆ కుటుంబం దాడి చేస్తోందని మండి పడ్డారు. కేసీఆర్ నెల నెలా వేతనం తీసుకుంటు న్నారు కానీ సభకు మాత్రం రావడం లేదని, ఒక్కరోజు కూడా అసెంబ్లీకి రాని ఆయనకు వేతనం కట్ చేయ వద్దా అని ప్రశ్నించారు. లోక్ సభ ఎన్నికల్లో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను బీఆర్ఎస్ గెలిపించిందని ఆరో పించారు. మున్సిపల్ ఎన్నికల కోసం బీజేపీ జాతీయ అధ్యక్షుడిని తీసుకువచ్చిందని, కానీ కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను అరెస్టు చేశాకే వారు ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. రెండేళ్లు మీరేం చేశారని బీజేపీ ప్రశ్నిస్తోందని, కానీ పదేళ్లు వారేం చేశారో చెప్పడం లేదని చురక అంటించారు. మోదీ, అమిత్ షా ఎవరిని తీసుకొచ్చినా మున్సిపల్ ఎన్నికల్లో ఒక్క సీటు బీజేపీ గెలవదని అన్నారు. పాల మూరు రంగారెడ్డి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ఎందుకు గుర్తించడం లేదని ప్రశ్నించారు. అలాంట ప్పుడు బీజేపీ జాతీయ అధ్యక్షుడు తెలంగాణకు ఎందు కోసం వచ్చినట్లని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో సీబీఐ విచారణ చేయించాలని అసెంబ్లీ తీర్మానం చేసి పంపిస్తే కేంద్రం స్పందించలేదని మండి పడ్డారు. ఫార్ములా ఈ రేసు కేసులో చర్యలు తీసు కోవాలని కోరినా స్పందించడం లేదని ఆరోపించారు. మెట్రో రైలు మంజూరు చేయలేదని, మూసీ ప్రక్షాళనకు నిధులు ఇవ్వలేదని అన్నారు. కాళేశ్వరం బీఆర్ఎస్‌కు ఏటీఎంలా మారిందని మోదీ, అమిత్ షా కూడా అన్నారని గుర్తి చేశారు. తాము అధికారంలోకి వచ్చాక ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామని, ఎంతో అభివృద్ధి చేశామని అన్నారు. వెయ్యి బస్సులకు ఆడ బిడ్డలను యజమానులుగా చేశామని, రెండేళ్లలో 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని వెల్లడించారు. రైతులకు రుణమాఫీ చేశామని అన్నారు. కానీ బీఆర్ఎస్ హయా ంలో ఆడబిడ్డల చీరల్లో కూడా కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు.

## తిరుమల లడ్డూ వ్యవహారంలో సీబీఐ ఎక్కడా క్లీన్ చిట్ ఇవ్వలేదు

(మొదటిపేజీ తరువాయి)

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు ఎంతో పవిత్రంగా భావించే తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో గత ప్రభుత్వ హయాంలో భారీ కుంభకోణం జరిగిందని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారం సుప్రీంకోర్టు వరకు వెళ్లినా, ఇందులో సీబీఐ ఎక్కడా క్లీన్ చిట్ ఇవ్వలేదని ఆయన గుర్తుచేశారు. ఈ వ్యవహారంలో దోషులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని, భగవంతుడి ముందు వారు మోకరిల్లే వరకు తమ యుద్ధం ఆగదని హెచ్చరించారు. నెయ్యి పేరుతో పామాయిల్, ప్రమాదకరమైన రసాయనాలు వాడి భక్తుల మనోభావాలను, ఆరోగ్యాన్ని దెబ్బతీశారని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ వ్యవహారంపై మాట్లాడేటప్పుడు తాము అన్ని పరిణామాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని, ఈ అంశాన్ని ప్రజల దృష్టికి తీసుకురావడం తన బాధ్యత అని స్పష్టం చేశారు. ఇవాళ ఉండవల్లిలో కూటమి నేతల సమావేశం అనంతరం నిర్వహించిన ప్రెస్ మీట్ లో పవన్ మాట్లాడారు. పవన్ కల్యాణ్ తన ఆరోపణలకు సంబంధించిన గణాంకాలను కూడా మీడియా ముందుంచారు. "తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) ఓ నిర్దిష్ట కంపెనీ 59.70 లక్షల కిలోల నెయ్యి సరఫరా చేసినట్లు అధికారికంగా లెక్కలు చూపింది. కానీ, మా వద్ద ఉన్న ఆధారాల ప్రకారం, అదే కంపెనీ 58 లక్షల కిలోలకు పైగా పామాయిల్, దానికి సంబంధించిన ప్లాంట్ బేస్డ్ ఉత్పత్తులను కొనుగోలు చేసింది. అంతేకాకుండా, సుమారు 1.70 లక్షల నుంచి 2 లక్షల కిలోల వరకు రసాయనాలను కూడా కొనుగోలు చేసినట్లు ఆన్ రికార్డ్ ఆధారాలున్నాయి. నెయ్యి సరఫరా చేస్తున్నామని చెప్పి, పామాయిల్, రసాయనాలు కొనుగోలు చేయడం వెనుక ఉన్న మతలబు ఏంటి? ఇది కల్తీ నెయ్యి కాదు, కల్తీ వనస్పతి, కల్తీ పామాయిల్" అని పవన్ వివరించారు.

ఈ కుంభకోణం కేవలం తిరుమలతోనే ఆగిపోలేదని, అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ మహోత్సవానికి కూడా ఇక్కడి నుంచి పంపిన లక్ష లడ్డూలు సైతం ఈ కల్తీ నెయ్యితో తయారు చేసినవేనని పవన్ ఆరోపించారు. దేశమంతా ఎంతో పవిత్రంగా జరుపుకున్న కార్యక్రమానికి సైతం కల్తీ లడ్డూలు పంపి హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచారని ఆయన మండిపడ్డారు. గత ప్రభుత్వానికి దేవుడిపై, హిందూ సంప్రదాయాలపై పగ ఉందని, అందుకే ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని పవన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. "వీరికి ఏడుకొండల స్వామిపై ఎందుకో పగ. ఏడు కొండలు ఎందుకు, రెండు చాలు అన్న చరిత్ర వీరిది. వీరు వ్యక్తులపై, ప్రత్యర్థులపై కాదు, ఏకంగా భగవంతుడిపైనే పగబట్టారు. ఈ కుట్ర వెనుక ఉన్న వారి వారసత్వం, వారి పరంపర ఎలాంటిదో ప్రజలు గమనించాలి. అందుకే ఈ అంశాన్ని సరిదిద్ది, వాస్తవాలను బయటపెట్టాల్సిన అవసరం ఉంది" అని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ అక్రమాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన పరోక్షంగా హెచ్చరించారు.

"గత ఐదేళ్లలో, అంటే 2019 నుంచి 2024 వరకు, రాష్ట్రంలో వైసీపీ పాలనలో హిందూ ధర్మానికి, దేవాలయాలకు తీరని అపచారాలు జరిగాయి. ఇవి చాలా సున్నితమైన అంశాలు. మత విశ్వాసాలతో ముడిపడి ఉన్న విషయాలపై ఆనాటి ప్రభుత్వ పెద్దలు చూపిన నిర్లక్ష్యం, వారి బాధ్యతారాహిత్యం ప్రజల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయి. ఉదాహరణకు, రామతీర్థంలో సాక్షాత్తూ శ్రీరామచంద్రమూర్తి విగ్రహ శిరచ్ఛేదనం జరిగితే, దాన్ని ఎవరో ఆకతాయి చేసిన పనిగా తేల్చేశారు. పిఠాపురంలో దేవతా విగ్రహాలకు అశుద్ధం పూస్తే, దానిని ఎవరో పిచ్చోడి చర్యగా చిత్రీకరించి చేతులు దులుపుకున్నారు. విజయవాడ కనకదుర్గమ్మ వారి ఆలయంలో వెండి సింహాలు మాయమైతే, 'అవి పోతే ఇంకొకటి కొంటాం, వాటితో ఏమైనా మేడలు, మిద్దెలు కడతామా?' అని అప్పటి మంత్రులు ఎంత నిర్లక్ష్యంగా మాట్లాడారో ప్రజలు మర్చిపోలేదు. ఇక అంతర్వేదిలో పవిత్రమైన రథం కాలిపోతే, దాన్ని మతిస్థిమితం లేని వ్యక్తి చేసిన పనిగా తేల్చేసి కేసును పక్కన పెట్టేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు ఎన్నో జరిగినా, ఆనాటి ప్రభుత్వంలో ఒక్కరు కూడా బాధ్యతగా మాట్లాడటం గానీ, కఠిన చర్యలు తీసుకోవడం గానీ చేయలేదు. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఇలాంటి పాత విషయాలపై ఆరోపణలు, విమర్శలు చేసి రాజకీయ లబ్ధి పొందాల్సిన అవసరం మాకేముంటుంది? మా దగ్గర స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి కాబట్టే ఈ విషయాలను ప్రస్తావిస్తున్నాం. జరిగిన వాస్తవాలు మాకు తెలిసి కూడా ప్రజలకు చెప్పకపోతే, భవిష్యత్తులో వారే మమ్మల్ని నిలదీస్తారు, 'మీకు తెలిసినా ఎందుకు మౌనంగా ఉన్నారు?' అని అడుగుతారు. అందుకే బయటకు వచ్చి మాట్లాడుతున్నాం. గత ఐదేళ్లలో హైందవ సంస్కృతి, మన ధర్మంపై వైసీపీ ప్రభుత్వం తరచుగా దాడులకు, అపవిత్ర కార్యాలకు తెగబడింది. అందుకే దీనిపై మాట్లాడాల్సిన, ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం జరిగిన తప్పులకు క్షమాపణ చెప్పాల్సింది పోయి, ఎదురు మాపైనే విమర్శలు చేస్తున్నారు. ఒకటే విషయాన్ని స్పష్టంగా చెప్తున్నాను... భగవంతుడి మీద పగ పెట్టుకున్నవాడు ఎవడైనా సరే సర్వనాశనం అయిపోతాడు. చరిత్రలో అలా బతికి బట్ట కట్టిన దాఖలాలు కూడా లేవు. ఈ విషయాన్ని అందరూ గుర్తుపెట్టుకోవాలి" అని పవన్ తీవ్ర హెచ్చరికలు చేశారు.

## ఏపీ హైకోర్టులో అంబటి క్వాష్ పిటిషన్..

**అమరావతి - సూర్య వాస్తవం**

ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యల కేసులో అరెస్టయిన మాజీ మంత్రి అంబటి రాంబాబు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదు చేసిన కేసును రద్దు చేయాలని (క్వాష్) కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం న్యాయస్థానం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా అంబటి తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఆయనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని, రిమాండ్ విధించడం చట్టవిరుద్ధమని కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న న్యాయస్థానం, ఈ పిటిషన్‌పై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. అనంతరం, తదుపరి విచారణను ఈ నెల 11వ తేదీకి వాయిదా వేసింది. మరోవైపు, అంబటి కస్టడీ, బెయిల్, జైలులో సౌకర్యాలకు సంబంధించిన పిటిషన్‌పై గుంటూరు కోర్టులో కూడా విచారణ జరిగింది. ఈ పిటిషన్‌పై విచారణను న్యాయస్థానం రేపటికి వాయిదా వేసింది.

ముఖ్యమంత్రి చంద్రబాబును దూషిస్తూ బూతులతో విరుచుకుపడ్డారనే ఆరోపణలతో అంబటి రాంబాబుపై పోలీసులు కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

# కాంగ్రెస్ పాలనకు రిఫరెండం...

**హైదరాబాద్, – సూర్య వాస్తవం**



తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు కనిపిస్తున్నాయి. అధికార కాంగ్రెస్, దూకుడు మీదున్న బీజేపీ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అగ్రనేతలను రంగంలోకి దించగా, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మాత్రం స్థానిక నేతలకే బాధ్యత వదిలేసింది. తెలంగాణలోని 123 మున్సిపల్ , 7 కార్పొరేషన్లకు జరుగుతున్న ఈ ఎన్నికలను అధికార కాంగ్రెస్ పార్టీ తన పాలనకు ఒక రెఫరెండంగా భావిస్తోంది. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాల్లో పర్యటిస్తూ ప్రచారాన్ని హోరెత్తించాలని నిర్ణయించారు. పట్టణ ఓటర్లను ఆకట్టుకునేందుకు వరాల జల్లు కురిపిస్తూ, మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా తన పట్టును నిరూపించుకోవాలని చూస్తున్నారు. కేడర్‌లో ఉత్సాహం నింపేలా ప్రతి మున్సిపాలిటీకి మంత్రులను ఇన్–ఛార్జులుగా నియమించి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. బీజేపీ సైతం ఏమాత్రం తగ్గడం లేదు. జాతీయ అధ్యక్షుడు స్వయంగా ప్రచారానికి వస్తుండటమే కాకుండా, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ వంటి వారు గల్లీ గల్లీ తిరుగుతున్నారు. వీటికి అదనంగా, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రెండు రోజుల పాటు తెలంగాణలో బీజేపీ అభ్యర్థుల తరపున ప్రచారం చేయనుండటం ఆ పార్టీకి పెద్ద ప్లస్ పాయింట్‌గా మారింది. జనసేన మద్దతుతో సెటిలర్ల ఓట్లను, యువత ఓట్లను గంపగుత్తగా కొల్లగొట్టాలన్నది బీజేపీ వ్యూహం. ఇంతటి భారీ యంత్రాంగాన్ని దింపడం ద్వారా రాష్ట్రంలో తామే ప్రత్యామ్నాయం అనే సంకేతాన్ని ఆ పార్టీ పంపిస్తోంది. ఈ హడావుడి మధ్య బీఆర్ఎస్ తీరు రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. గతంలో ప్రతి చిన్న ఎన్నికనూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకునే అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు ఈసారి ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. కేవలం ప్రెస్ మీట్లకే పరిమితమవుతూ, క్షేత్రస్థాయి ప్రచార బాధ్యతలను స్థానిక ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్–ఛార్జులకే వదిలేశారు. అభ్యర్థుల ఎంపిక కూడా వారికే ఇచ్చారు. దీనివల్ల పార్టీ శ్రేణుల్లో ఒక రకమైన స్తబ్దత నెలకొంది. బీఆర్ఎస్ ఈ ఎన్నికలను లైట్ తీసుకోవడం వెనుక లోతైన రాజకీయ కారణాలు ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఎన్నికల్లో ఫలితాలు తారుమారైతే, ఆ ఓటమి బాధ్యతను తమపై వేసుకోకుండా తప్పించుకోవడానికే అగ్రనేతలు దూరంగా ఉంటున్నారన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఎమ్మెల్యేలకు బాధ్యతలు అప్పగించడం ద్వారా.. ఫలితాలు బాగుంటే పార్టీ పుంజుకుందన్న ప్రచారం, తేడా వస్తే స్థానిక నేతల వైఫల్యంగా చూపించే వీలుంటుందని పార్టీ పెద్దలు భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ఇది కార్యకర్తలను నిరుత్సాహానికి గురిచేస్తోంది. కాంగ్రెస్ తన అధికారాన్ని నిలబెట్టుకోవడానికి, బీజేపీ తన బలాన్ని నిరూపించుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతుంటే.. బీఆర్ఎస్ మాత్రం డిఫెన్సివ్ మోడ్‌లో కనిపిస్తోంది.

# ఫోన్ ట్యాపింగ్ కేసు.. తర్వాత ఏంటీ...

**హైదరాబాద్, – సూర్య వాస్తవం**



తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు ఇప్పుడు నిర్ణయాత్మక దశకు చేరుకుంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించడంతో ఈ కేసులో ప్రధాన అంకం ముగిసింది. తర్వాత సిట్ ఏమి చేయబోతోందన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు. కానీ సిట్‌కు అసలు సవాల్ ఇప్పుడే ప్రారంభమైందన్న భావన వినిపిస్తోంది. ఆదివారం కేసీఆర్ నివాసంలో సుమారు ఐదు గంటల పాటు సాగిన సిట్ విచారణ ఈ కేసులో కీలక మలుపు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తన ప్రభుత్వానికి తెలియకుండానే జరిగిందని, చట్టబద్ధమైన నిఘాకు, అక్రమ ట్యాపింగ్‌కు తేడా ఉందని కేసీఆర్ వాదించినట్లు తెలుస్తోంది. అయితే, సిట్ అధికారులు ఆయన ముందు ఉంచిన సాంకేతిక ఆధారాలు ఈ కేసును మరింత ఆసక్తికరంగా మార్చినట్లుగా చెబుతున్నారు.

ముఖ్యంగా ప్రభాకర్ రావు వంటి అధికారుల పునర్నియామకం , రాజకీయ నేతలతో పాటు న్యాయమూర్తులు, వ్యాపారులు.. హరీష్ రావు ఫోన్లు ట్యాప్ చేయడంపై అధికారులు సంధించిన ప్రశ్నలకు సంధించినట్లుగా చెబు?తున్నారు. ఈ కేసు కేవలం రాజకీయ నిఘాకే పరిమితం కాలేదనేది సిట్ అధికారుల ప్రధాన ఆరోపణ. ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారాన్ని ఆసరాగా చేసుకుని కొందరు పారిశ్రామికవేత్తలను భయపెట్టి భారీగా వసూళ్లకు పాల్పడ్డారని, ఇందులో ఒక పోలీస్ మాఫియా పనిచేసిందని దర్యాప్తులో వెల్లడైంది. బీఆర్ఎస్ పార్టీకి వచ్చిన ఎలక్టోరల్ బాండ్ల విరాళాలకు, ఈ ట్యాపింగ్ బెదిరింపులకు ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో సిట్ ఆరా తీస్తోంది. రాజకీయ అధికారాన్ని ఉపయోగించి వ్యక్తిగత గోప్యతను హరించడమే కాకుండా, దాన్ని ధనార్జనకు వాడుకోవడం ఈ కేసులో అత్యంత తీవ్రమైన అంశం. దర్యాప్తు అధికారుల ముందున్న అతిపెద్ద సవాల్.. ధ్వంసమైన ఆధారాలను పునరుద్ధరించడం. నిందితులు హార్డ్ డిస్క్‌లను మూసీ నదిలో పడేయడం, కీలక డేటాను డిలీట్ చేయడం ద్వారా కుట్రను కప్పిపుచ్చే ప్రయత్నం చేశారని ఇప్పటికే గుర్తించారు. తాజాగా అందిన ఫోరెన్సిక్ నివేదికలు. క్లౌడ్ డేటా రికవరీ ద్వారా సిట్ కొన్ని కీలక ఫైళ్లను వెలికి తీసినట్లుగా చెబుతున్నారు. ఈ సాంకేతిక ఆధారాలను కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు వంటి నేతల వాంగ్మూలాలతో సరిపోల్చి పక్కాగా చార్జిషీట్ రూపొందించాలని సిట్ భావిస్తోంది. న్యాయస్థానంలో కేవలం నిందితులు లేదా సాక్షుల వాంగ్మూలాలు నిలబడవు. టెలిగ్రాఫ్ చట్టం, టీ చట్టాల ప్రకారం నిబంధనలు ఎలా ఉల్లంఘించారో శాస్త్రీయంగా నిరూపించాల్సి ఉంటుంది. ఎవరి అనుమతితో ట్యాపింగ్ జరిగింది.. అనుమతి లేని నంబర్లను ఎందుకు మానిటర్ చేశారు అనే ప్రశ్నలకు సిట్ ఇచ్చే సమాధానాలే ఈ కేసు భవితవ్యాన్ని నిర్ణయిస్తాయి. ఇప్పటికే ఆరుగురు అధికారులపై మొదటి చార్జిషీట్ దాఖలు చేసిన పోలీసులు, ఇప్పుడు కుట్ర' కోణంలో సప్లిమెంటరీ చార్జిషీట్ వేయనున్నారు. ఇందులో కేసీఆర్ పేరును నిందితుడు గా చేరుస్తారా లేక సాక్షి గా ఉంచుతారా అన్నది సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది. ఒకవేళ నేరపూరిత కుట్రలో ఆయన ప్రమేయం ఉందని ఆధారాలు దొరికితే, అరెస్టుల పర్వం మళ్లీ మొదలయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# రాజ్యసభకు చిరంజీవి...?

**విజయవాడ – సూర్య వాస్తవం**



ఏపీలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. కూటమి 20 నెలల పాలన పూర్తి చేసుకుంది. ప్రజల్లో ఒక రకమైన సంతృప్తి కనిపిస్తోంది. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో దూకుడుగా వ్యవహరిస్తోంది. అయితే టిడిపి శ్రేణులు గట్టిగానే ఢీకొడుతున్నాయి. వారితో పోల్చుకుంటే జనసేన నేతలు స్పందించడం లేదు. దీనిపైనే చర్చ నడుస్తుండగా పార్టీ శ్రేణులకు గట్టి సంకేతాలు పంపారు పవన్ కళ్యాణ్. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని గట్టిగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఇటువంటి పరిస్థితుల్లో ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. వారిద్దరి మధ్య కీలక రాజకీయ చర్చలు జరిగాయి. లడ్డూ వివాదం నేపథ్యంలో.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విషయంలో అనుసరించాల్సిన అంశాలపై వారిద్దరి మధ్య చర్చ సాగింది. సహజంగానే ఇద్దరు నేతల ఏకాంత భేటీ అంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గురించి అయి ఉంటుంది. మరోవైపు ఇటీవల పవన్ ఢిల్లీ వెళ్లి వచ్చారు. దీంతో ఇద్దరి భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. తిరుమల లడ్డూ తయారీకి సంబంధించి వాడిన నెయ్యిలో వైసిపి హయాంలో జంతు కొవ్వు కలిసిందన్నది ప్రధాన ఆరోపణ. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం గత కొద్ది నెలలుగా విచారణ చేపట్టింది. ఇటీవల కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. మరోవైపు సిబిఐ ల్యాబ్ నిర్ధారణ అంటూ ఒక విషయం బయటపడింది. ఆ నెయ్యిలో జంతు కొవ్వు కలపలేదన్నది ఒక వాదన. వాడినది మాత్రం ఆవు పాలతో తయారు చేసిన నెయ్యి కాదని.. కొన్ని రసాయనాల మిశ్రమాలతో తయారు చేసింది అంటూ మరో వాదన. ఈ విషయంలో అధికార విపక్షాల మధ్య గట్టి ఫైట్ నడుస్తోంది. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఫ్లెక్సీలు వెలిసాయి. దానికి వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాప ప్రక్షాళన యాత్ర చేపట్టింది. అందులో భాగంగా మాజీమంత్రి అంబటి రాంబాబును టిడిపి శ్రేణులు అడ్డగించాయి. ఈ క్రమంలో ఆయన సీఎం చంద్రబాబుపై బూతు వ్యాఖ్యలు చేశారు. ఆయన అరెస్టు జరిగింది. ఈరోజు అంబటి కుటుంబ సభ్యులను జగన్మోహన్ రెడ్డి పరామర్శించారు. అయితే ఈ ఎపిసోడ్ నేపథ్యంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఇటీవల ఢిల్లీ వెళ్లి వచ్చారు పవన్ కళ్యాణ్. కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులపై చర్చించారు. అయితే హోం శాఖ మంత్రి అమిత్ షాను కలవడం మాత్రం కొత్త చర్చకు దారితీసింది. రాజ్యసభ పదవి కోసమే పవన్ ఢిల్లీ వెళ్లారని ప్రచారం జరిగింది. ఈ ఏడాది జూన్లో ఏపీ నుంచి నలుగురు రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ్ నత్వాని.. టిడిపికి చెందిన సానా సతీష్ పదవీ విరమణ చేయనున్నారు. గతంలో నాలుగు రాజ్యసభ పదవులకు గాను.. బిజెపి, టిడిపి రెండు పదవులు చొప్పున తీసుకున్నాయి. జనసేనకు రాజ్యసభలో ఇంతవరకు ప్రాతినిధ్యం లేదు. అందుకే ఈసారి తమకు చాన్స్ ఇవ్వాలని కోరేందుకు పవన్ కళ్యాణ్ ఢిల్లీ వెళ్లినట్లు ఒక ప్రచారం అయితే మాత్రం జరిగింది. అయితే ఈరోజు సీఎం చంద్రబాబుతో పవన్ కళ్యాణ్ భేటీ రాజ్యసభ పదవుల కోసమేనన్న చర్చ నడుస్తోంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో జనసేనకు ఒక రాజ్యసభ పదవి ఖాయమని తెలుస్తోంది. ప్రధానంగా లింగమనేని రమేష్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. కానీ ఇప్పుడు పవన్ కళ్యాణ్ చిరంజీవి పేరు తెరపైకి తెస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. చిరంజీవిని రాజ్యసభకు పంపితే జరిగే లాభనష్టాలు గురించి వారిద్దరూ చర్చించుకున్నట్లు కూడా టాక్ నడుస్తోంది. గతంలో కూడా చిరంజీవి విషయంలో రకరకాల ప్రచారాలు జరిగాయి. వైసిపి కూడా చిరంజీవిని రాజ్యసభకు ప్రమోట్ చేయాలని ప్రయత్నించినట్లు ఊహాగానాలు వచ్చాయి. అయితే ఇప్పుడు మరోసారి పవన్ చిరంజీవిని రాజ్యసభకు పంపిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. అయితే రాజకీయాలకు దూరంగా.. సినిమాల్లో బిజీగా ఉన్నారు చిరంజీవి. అందుకే ఈ ప్రచారంలో ఎంత వాస్తవం ఉందనేది తెలియాలి.

# అంబటి అరెస్ట్ - వైసీపీ ప్లాన్ బి?

**గుంటూరు – సూర్య వాస్తవం**



ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఇప్పుడు ఎవరికీ అర్థం కానంత గజిబిజిగా మారాయి. కొద్ది రోజులుగా తిరుమల లడ్డూ కల్తీ అంశంపై సిట్ ఛార్జ్‌షీట్ దాఖలు చేయడం, అసలు నెయ్యే వాడలేదని చెప్పడం, మాజీ టీటీడీ అధికారుల పేర్లు బయటకు రావడం వైసీపీని డిఫెన్స్‌లో పడేసింది. అదే సమయంలో జంతువుల కొవ్వులేదన్న అంశం ఆధారంగా ఎదురుదాడి ప్రారంభించింది. ఈ సమయంలో హఠాత్తుగా రాజకీయం మారిపోయింది. మాజీ మంత్రి అంబటి రాంబాబు వంటి నేతలు ఉద్దేశపూర్వకంగా అత్యంత అసభ్యకరమైన పదజాలాన్ని ఉపయోగించడం ప్రారంభించారు. ఇదంతా ఓ డైవర్షన్ గేమ్‌గా కనిపిస్తోంది. అంబటి రాంబాబు కారులో కూర్చుని మీడియా ప్రతినిధిని పిలిపించుకుని మరీ బూతులు తిట్టడం యథాలాపంగా జరిగింది కాదని స్పష్టమవుతోంది. ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ప్రభుత్వం కచ్చితంగా స్పందిస్తుందని, అరెస్టులు జరుగుతాయని వారికి ముందే తెలుసు. అరెస్టు జరిగినప్పుడు దాన్ని రాజకీయ కక్ష గా చిత్రించడం, కాపు సామాజికవర్గ కార్డును వాడటం ద్వారా వైసీపీ తన క్యాడర్‌లో మళ్లీ ఊపు తీసుకురావాలని చూస్తోంది. అంబటిని 14 రోజుల రిమాండ్‌కు పంపడం, ఆయనపై 16కు పైగా కేసులు నమోదు కావడం ద్వారా ఒక రకమైన పొలిటికల్ విక్టిమైజేషన్ ఇమేజ్‌ను సృష్టించేందుకు వైసీపీ ప్రయత్నిస్తోంది. వైసీపీ నేతలు సృష్టించిన ఈ బూతుల డైవర్షన్ ట్రాప్‌లో పడకుండా కూటమి ప్రభుత్వం అప్రమత్తమైంది. అరెస్టులు, దాడుల వల్ల టాపిక్ మారుతోందని గమనించిన చంద్రబాబు నాయుడు, వెంటనే తన నేతలను అలర్ట్ చేశారు. చర్చను మళ్లీ లడ్డూ అంశంపైకే తీసుకువచ్చేలా మంగళవారం కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కేవలం సిట్ నివేదికకే పరిమితం కాకుండా, అందులోని లోపాలను, అసలు సూత్రధారులను పట్టుకోవడానికి ఒక ప్రత్యేక విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీని ద్వారా వైసీపీ బూతుల డైవర్షన్ ప్లాన్‌ను చెక్ పెట్టి, మళ్లీ లడ్డూ అస్త్రంతోనే వారిని డిఫెన్స్‌లోకి నెట్టింది. ఏపీ రాజకీయాల్లో ఈ మలుపులు అంతా ఒక ముందస్తు ప్రణాళిక ప్రకారమే సాగుతున్నట్లు కనిపిస్తోంది. వైసీపీ తరపున ప్లాన్ చేస్తున్నది ఎవరో కానీ.. చర్చను లడ్డూ కల్తీ వంటి సెంటిమెంట్ ఇష్యూ నుంచి రాజకీయ ప్రతీకారం ఇష్యూలోకి మార్చడంలో కొంతవరకు సక్సెస్ అయ్యారు. అయితే, చంద్రబాబు తన అనుభవాన్ని రంగరించి, కేబినెట్ నిర్ణయాల ద్వారా మళ్లీ బంతిని వైసీపీ కోర్టులోకి విసిరారు. ముఖ్యంగా పయ్యావుల కేశవ్ వంటి మంత్రులు ఈ కమిషన్ కేవలం విచారణే కాకుండా, సిస్టమ్‌లోని లోపాలను సరిదిద్దేందుకే అని చెప్పడం ద్వారా ప్రభుత్వానికి ఉన్న క్లీన్ ఇంటెన్షన్ ను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయ పార్టీలు తమ వ్యూహాల కోసం టాపిక్స్‌ను డైవర్ట్ చేస్తున్నా, ప్రజలు మాత్రం లడ్డూ కల్తీ వ్యవహారంలో దోషులు ఎవరో తెలియాలని బలంగా కోరుకుంటున్నారు. బూతులు మాట్లాడే నేతలకు చట్టం పవర్ చూపించడం ఒక ఎత్తు అయితే, భక్తుల మనోభావాలను దెబ్బతీసిన వారిని శిక్షించడం మరో ఎత్తు. వైసీపీ నేతలు సానుభూతి కోసం ప్రయత్నిస్తుంటే, కూటమి ప్రభుత్వం న్యాయం కోసం విచారణ కమిషన్‌ను నమ్ముకుంది. ఈ డైవర్షన్ గేమ్ లో అంతిమంగా ఎవరిది పైచేయి అవుతుందన్నది ముందు ముందు తెలియనుంది.

# అరవ బలిపశువు అయ్యారా...

**కడప – సూర్య వాస్తవం**



రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యవహారం వెనక కుట్ర జరిగిందన్న ప్రచారం జరుగుతుంది. అరవ శ్రీధర్ చేసింది తప్పే. వివాహిత మహిళతో సంబంధాన్ని కొనసాగించడాన్ని ఎవరూ అంగీకరించరు. అలాగే మహిళ కూడా ఎమ్మెల్యే కావడంతో అరవ శ్రీధర్ అంటే ఇష్టపడి దగ్గరయ్యారు. అయితే వీరు విడిపోవడానికి అనేక కారణాలు వినిపిస్తున్నాయి. అరవ శ్రీధర్ వ్యవహారంపై లైంగిక వేధింపులు రావడంతో జనసేన పార్టీ వెంటనే త్రిసభ్య కమిటీని నియమించింది. నిన్న విచారణ కూడా పూర్తి చేసింది. నివేదిక ఏమిస్తుందన్నది చూడాలి. అయితే అరవ శ్రీధర్ వ్యవహారంలో కొత్త కోణం బయటపడుతుంది. ఎస్సీ యువకుడు కావడంతో కొందరు కావాలనే తమ పట్టు నుంచి జారి పోతారని భావించి ఇద్దరి మధ్య గ్యాప్ క్రియేట్ చేశారంటున్నారు. జనసేన నేత, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పై పోలీసు కేసు కూడా నమోదయింది. ఓ మహిళా ఉద్యోగి లైంగిక వేధింపుల ఆరోపణలు చేయడం సంచలనం కలిగించింది. మరొకవైపు అరవ శ్రీధర్‌ను సదరు మహిళ పాతిక కోట్ల రూపాయలు డిమాండ్ చేసి బెదిరించిందని ఆరోపణలు కూడా వినిపించాయి. ఓ మహిళ మీడియా ముందుకు వచ్చి ఆరోపణలు చేసినా అరవ శ్రీధర్ పై కేసు నమోదు చేయలేదని విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలోనే ఎట్టకేలకు అరవ శ్రీధర్ పై కేసు నమోదైంది. తిరుపతి జిల్లా ఎస్పీకి ఆ మహిళ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కూడా ఈ కేసులో దర్యాప్తును వేగంగా కొనసాగించి వాస్తవాలు బయటకు తీసుకు వచ్చే అవకాశాలున్నాయి. అయితే సాధారణంగా ఎస్సీ నియోజకవర్గం అంటే అగ్ర కులాల పెత్తనం ఉంటుంది. దాదాపు అన్ని ఎస్సీ నియోజక వర్గాల్లో ఇదే పరిస్థితి. ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ అదే పరిస్థితి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనూ ఎస్సీ ఎమ్మెల్యేలపై అగ్రవర్ణాల నేతల పెత్తనం ఎక్కువగా కనపడేది. కొందరు ధైర్యంగా ఎదురుతిరుగుతారు. చాలా మంది ఎమ్మెల్యే పదవి చాలు అని మౌనంగా ఉంటారు. అరవ శ్రీధర్ కు రైల్వే కోడూరులో అసలు పనే లేదట. ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ అసలు పెత్తనం చేసేది మాత్రం టీడీపీకి చెందిన నేతగా చెబుతున్నారు. అతని కనుసన్నల్లోనే ఈ వ్యవహారం సాగుతుంది. ఇద్దరు కలిసి ఉండాలని భావించినా ఆ మహిళ అరవ శ్రీధర్ కు తోడుగా ఉంటే తమ పనులు చెల్లుబాటు కావని భావించి ఇద్దరినీ దూరం చేశారంటున్నారు. తొలి నుంచి అరవ శ్రీధర్ ఆ కుటుంబానికి సేవకుడిగానే ఉంటున్నారన్నది టాక్. గత ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ రైల్వే కోడూరు నియోజకవర్గం అభ్యర్థిగా యనమల భాస్కర రావును బహిరంగంగానే ప్రకటించారు. యనమల భాస్కర్ రావు స్వతంత్రంగా ఆలోచించే వ్యక్తి కావడంతో అతను ఎమ్మెల్యే అయితే తమ పనులు సాగవని భావించి టీడీపీ నేత ఒకరు చక్రం తిప్పి చివరి నిమిషంలో వైసీపీలో ఉన్న అరవ శ్రీధర్ ను జనసేనలోకి చేర్పించి టిక్కెట్ ఇప్పించారంటున్నారు. అరవ శ్రీధర్ ఏ ప్రారంభోత్సవం, శంకుస్థాపన, ప్రభుత్వ కార్యక్రమాల్లోనైనా నాలుగో స్థానంలోనే ఉంటారని చెబుతున్నారు. ఆ టీడీపీ నేత కుటుంబంలోని ముగ్గురు ముందు వరసలో ఉంటారు. పనిపాటా లేక ఈ యువతికి దగ్గరయ్యారన్నది అందుతున్న సమాచారం మేరకు తెలుస్తోంది. ఆ యువతి చదువుకున్నది కావడంతో తమకు ఇబ్బందిగా మారుతుందని భావించి టీడీపీ నేత ఇద్దరినీ దూరం చేయడంతోనే ఈ వివాదం రచ్చకెక్కిందంటున్నారు.

## ప్రభుత్వ కళాశాలలో సెరికల్చర్ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం



**పులివెందుల - సూర్య వాస్తవం :** పులివెందులలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జువాలజీ డిపార్ట్మెంట్ ఇంచార్జ్ డాక్టర్ యు.శ్రీనిత ఆధ్వర్యంలో సెరీ కల్చర్ సర్టిఫికెట్ కోర్స్ ప్రారంభించడం జరిగినది.ఈ కార్యక్రమానికి డాక్టర్ బి.శ్రీనివాసులు అధ్యక్షత వహించి పట్టు పరిశ్రమ కుటీర పరిశ్రమగా స్థాపించి ఆర్థికంగా దేశాన్ని అభివృద్ధి చేయవచ్చని తెలియజేశారు.వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సి.బాలనారాయణ మాట్లాడుతూ పట్టు పరిశ్రమకు అవసరమైన మల్బరీ సాగు గురించి వివరించారు.డాక్టర్ యు.శ్రీనిత మాట్లాడుతూ పట్టు పురుగుల జాతులు ఎన్ని రకాలు ఉంటాయి. వాటిని ఎలా సాగు చేయవచ్చు,పట్టు కాయల నుంచి నాణ్యమైన పట్టును సేకరించే విధానాలను, ఒక కోకన్ నుంచి సుమారు 1000 యార్డ్స్ సిల్క్ తయారవుతుందని, పట్టు సహజమైన మరియు బలమైన ఫైబర్ దీనిని క్వీన్ ఆఫ్ టెక్స్టైల్ అని పిలుస్తారు.మల్బరీ పట్టు ఎరిపట్టు మూగ పట్టు టస్సర్ పట్టు అనే రకాలు కలవు. పట్టును పట్టు చీరలు,చొక్కాలు సూట్లు,టైలు తయారీలో, సర్జరీలో స్టిచ్చింగ్‌కు, అలంకరణ సామాగ్రి తయారు చేయుటలో మొదలైన వాటిలో వినియోగిస్తారు. ఈ కార్యక్రమంలో జనార్ధన, ప్రవళిక, విద్యార్థినిలు పాల్గొన్నారు.

### హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్

## కడప జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా ముని యాదవ్

**పులివెందుల - సూర్య వాస్తవం :** హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ కడప జిల్లా వైస్ ప్రెసిడెంట్, "మేకల ముని యాదవ్" ఎన్నికయ్యారు. జాతీయ చైర్మన్ నాదం నరసింహ రావు' నియమాకం మేరకు, ముని యాదవ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ముని యాదవ్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేలా, ప్రతి వ్యక్తి తన హక్కులను కాపాడుకునే విధంగా ప్రభుత్వ పథకాలు పేదలకు అందేలా కృషి చేస్తామని తెలిపారు.



## రాష్ట్రంలో ప్రమాదకర స్థాయిలో ఎయిడ్స్ వ్యాధి

### - డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి

**వేంపల్లె - సూర్య వాస్తవం :** రాష్ట్రంలో ప్రమాదకర స్థాయిలో ఎయిడ్స్ వ్యాధి విస్తరిస్తోందని తులసి రెడ్డి అన్నారు. రాజ్యసభలో కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ చెప్పిన వివరాల ప్రకారము 2020- 2024 మధ్య ఐదు సంవత్సరాలలో దేశవ్యాప్తంగా ఎయిడ్స్ వ్యాధితో 1,81,000 మంది మృతి చెందగా అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి 32వేల 642 మంది,తెలంగాణ నుంచి 11, 498 మంది మరణించడం శోచనీయం.మొత్తం మరణాలలో ఉభయ తెలుగు రాష్ట్రాల వాటా 25శాతం. ఐటీ రంగంలో ఎయిడ్స్ వ్యాధి శరవేగంగా వ్యాప్తి చెందుతోందని మంత్రి చెప్పడం జరిగింది. ఒకప్పుడు ఎయిడ్స్ పట్ల అవగాహన కార్యక్రమాలు, జాగ్రత్త చర్యలు పెద్ద ఎత్తున ఉండేవి.ఇటీవల కాలంలో అవగాహన కార్యక్రమాలు పూర్తిగా స్తంభించిపోయాయి. పర్యవసానంగా ఎయిడ్స్ వ్యాధి పట్ల జాగ్రత్తలు తీసుకోవడం తగ్గిపోయింది వలస కార్మికుల సంఖ్య ఎక్కువ కావడం,సురక్షితం కాని లైంగిక సంబంధాలు, ప్రభుత్వ అవగాహన కార్యక్రమాలు తగ్గడం ఇందుకు కారణం. ఏమాత్రం ఆలస్యం చేయకుండా ప్రభుత్వం వెంటనే ఎయిడ్స్ పట్ల అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేసి ఎయిడ్స్ వ్యాధి విస్తరణను అడ్డుకోవాలని తులసి రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

## ఉత్తమ పంచాయతీ కార్యదర్శి సిరి బాబుకు ప్రశంస




**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం :** కాకలవరం పంచాయతీ కార్యదర్శి సిరి బాబుకు రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి కమిషనర్ కృష్ణ తేజ నుంచి ఉత్తమ కార్యదర్శిగా ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ అభివృద్ధి అధికారుల పని తీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఇంటి పన్నులు 100 శాతం పూర్తి చేశారని అంతేకాకుండా గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడంలో కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు వివరించారని తడి పొడి చెత్త గ్రామ అభివృద్ధి శుభ్రత 100 శాతం పనులు పూర్తి చేశారని కమిషనర్ అభినందిస్తూ ప్రశంసా పత్రాన్ని అందజేసినట్లు సిరి బాబు తెలిపారు.

# సంపూర్ణ అక్షరాస్యతే అక్షరాంధ్ర లక్ష్యం

- **ఈ ఏడాది 1,25,578 మందిని అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యం**
- **జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా అమలు చేస్తున్న "అక్షరాంధ్ర" కార్యక్రమం ద్వారా జిల్లాలోని నిరక్షరాస్యతను పూర్తిగా నిర్మూలించడమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. గురువారం అనంతపురం నగరంలోని మున్నా నగర్‌లో ఉన్న వయోజన విద్యా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరం లో జిల్లాలో మొత్తం 1,25,578 మందిని అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. డిఆర్డీఏ, డ్వామా, మెప్మా శాఖల ద్వారా వాలంటరీ టీచర్లను, అభ్యసకులను గుర్తించి, వారికి భోదనాభ్యసన ప్రక్రియను అందిస్తున్నట్లు వివరించారు. అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా మెప్మా పరిధిలోని స్వయం సహాయక బృందాల సభ్యుల్లో 37,500 మందిని, డీఆర్‌డీఏ (ఐ=ఐూ) ద్వారా 62,500 మందిని, ఉపాధి హామీ పథకం పరిధిలో 25,000 మంది వేజ్ సీకర్స్‌ను అక్షరాంధ్ర కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన లబ్ధిదారులకు మొత్తం 100 గంటలపాటు చదవడం, రాయడం, ప్రాథమిక గణితం (కూడికలు, తీసివేతలు)పై భోదన అభ్యసన ప్రక్రియ అంది స్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియను ప్రభుత్వం గుర్తించిన వాలంటరీ టీచర్లు ద్వారా నిర్వహిస్తున్నామని, ఇందు కోసం అవసర మైన పాఠ్య పుస్తకాలు, వర్క్ షీట్లు అందజేయడంతో పాటు, వీడియో పాఠ్యాంశాల ద్వారా కూడా బోధన కొనసాగుతున్నట్లు తెలిపారు. భోదనాభ్యసన ప్రక్రియ అనంతరం లబ్ధిదారుల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు ఫిబ్రవరి చివరి వారంలో ప్రీ-ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు, అలాగే మార్చి 29వ తేదీన ఎన్ఐఓఎస్, న్యూ ఢిల్లీ వారిచే ఎఫ్ఎల్ఎన్ఏటీ ఫైనల్ పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఈ వయసులో చదువు అవసరమా అనే సందేహాలు పక్కనపెట్టి, అక్షరాస్యత వల్ల భవిష్యత్తులో కలిగే ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు. తల్లి దండ్రుల చదువు ద్వారా తమ పిల్లల చదువు కూడా మెరుగు పడుతుందని, వ్యక్తిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థ వంతంగా వినియోగించుకునే అవగాహన ఏర్పడుతుందని తెలిపారు. జిల్లా అక్షరాస్యత రేటును గణనీయంగా పెంచేందుకు అధికారులు, వాలంటరీ టీచర్లు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అక్షరాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసి, అనంతపురం జిల్లాను సంపూర్ణ అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వయోజన విద్య ఉప సంచాలకులు సంపంగి వెంకటేశ్వర్లు, వయోజన విద్య సిబ్బంది సూర్య నారాయణ, శ్రీధర్, రమణ, లక్ష్మినారాయణ, లక్ష్మి ప్రసన్న మరియు ఆర్.పి.లు రాణి, సునంద, మాధవి, వాలంటరీ టీచర్ రాజ్యలక్ష్మి, అభ్యాసకులు పాల్గొన్నారు.



# పదవ తరగతి మోడల్ క్వశ్చన్ పేపర్ విడుదల







**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి మండలం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గుత్తి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సురేష్, గురుకుల పాఠశాల ఏటీపీ రేవతి చేతులు మీదుగా పదవ తరగతి మోడల్ పరీక్ష క్వశ్చన్ పేపర్‌ని విడుదల చేశారు. అనంతరం ఎస్ఐ సురేష్, గురు కుల పాఠశాల ఏటీపీ రేవతి మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వ ర్యంలో పదవ తరగతి మోడల్ పరీక్షను రాష్ట్రవ్యాప్తంగా విద్యా ర్థులలో భయం వెళ్ళ గొట్టేందుకు పబ్లిక్ పరీక్షల కంటే ముందు నిర్వహించడం జరుగుతుందన్నారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు వెళ్తున్న విద్యార్థులు చాలా మందిలో భయం వెంటాడుతూ ఉంటుంది. ఆ భయాన్ని పోగొట్టి విద్యార్థులు పరీక్షలను ఫ్రీగా రాసే విధంగా ముందస్తుగా ఇలాంటి పదవ తరగతి మోడల్ పరీక్షలు పెట్టడం వలన విద్యార్థులలో భయం వెళ్లిపోతుందని తెలిపారు. ఇప్పుడున్న విద్యార్థులే రేపటి సమాజాన్ని మార్చే పౌరులుగా ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సమాజాన్ని మార్చే శక్తి కేవలం విద్యార్థులకు మాత్ర మే ఉందని తెలిపారు.ఈ సమా జా న్ని ఒక విద్యార్థి మార్చగలడు, ఈ సమాజాన్ని ఒక పెన్ను మార్చగలదు ఈ సమా జాన్ని ఒక పుస్తకం మార్చగలదు ఈ స మాజాన్ని ఒక టీచర్ మార్చగలడు అని గతంలో మేధావులు చా లా మంది చెప్పేవారన్నారు. ప్రతి ఒక విద్యార్థిని విద్యార్థులు కూడా ప్రస్తుత విద్యాభ్యాసంలోనే చదువుతో పాటు ఈ సమాజంలో జరుగుతున్న అవినీతిని కూడా ఏ దైనా తప్పులు కానీ మనం ప్రశ్నించడం నేర్చు కోవాలని పిలుపు నిచ్చారు. 2026లో 10వ తరగతి ఉత్తీర్ణత శాతం మన జిల్లా ప్రథమ స్థానంలో ఉండాలని విద్యా ర్థులకు పిలుపు నిచ్చారు. ప్రతి ఒక్క విద్యార్థి కూడా 10వ తరగ తి పబ్లిక్ పరీక్షలు ఎటువంటి భయం లేకుండా ప్రశాంతంగా రా యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు శ్యామ్, సుందర్ పట్టణ నాయకులు రంజిత్, శంకరప్ప, మోహన్ లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

# భక్తులు ఆలయ అభివృద్ధికి సహకరించండి

### - సాయిబాబా ఆలయంలో మాఘమాస పూజలు
### - ప్రత్యేక అలంకారంలో సాయినాధుడు - ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య

**పులివెందుల- సూర్య వాస్తవం :** పులివెందులలో పార్నపల్లి రోడ్డు సమీపంలో మొట్టమొదటిగా కొలువైన శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో మాఘ మాసాన్ని పురస్కరించుకొని గురువారం షిరిడి సాయిబాబా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయా స్తమాన స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు మురళి స్వామి ఆధ్వర్యంలో సాయినాధునికి ఉదయం కాగడ హారతి, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, అష్టోత్తర శతనామావళి, తదితర పూజా కార్యక్రమాల అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్నం హారతి సాయంకాలం 6 గంటలకు సంధ్య హారతి రాత్రి 9 గంట లకు శేజ హారతులు స్వామివారికి అర్పించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య మాట్లా డుతూ ప్రతి గురువారం ఆలయంలో భక్తుల సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమాలు విశేషంగా నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా మాఘ మాసంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకోవడం జరుగుతోందని తెలియజేశారు.

**ఆలయ అభివృద్ధికి సహకరించండి**

ఆలయ ప్రాంగణంలో ఆలయ అభివృద్ధిలో భాగంగా కళ్యాణ మండపం గదులు వంటి నిర్మాణాలు చేపట్టడం జరుగుతుంది. ఎవరైనా దాతలు ముందుకు వచ్చి షిరిడి సాయి బాబా ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య పిలుపునిచ్చారు. సహాయ సహకారాలు అందించిన దాతల పేర్లు ఆలయంలో శిలాఫలకం వేయించి శాశ్వతంగా ఉండే విధంగా చర్యలు చేపడతారని, ప్రతి సంవత్సరం గురు పౌర్ణమి లో దాతలకు విశేష పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో షిరిడి సాయి సేవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# రాయలసీమపై వైకాపాది, జగన్‌ది కపట ప్రేమ

## - డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం :** వైకాపా నాయకులు, జగన్మోహన్ రెడ్డి రాయలసీమపై మొసలి కన్నీరు కార్చడం, కపట ప్రేమ ప్రదర్శించడం హాస్యాస్పదమని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం పోతిరెడ్డిపాడు వద్ద రాయలసీమ ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలంటూ వైకాపా నాయకులు నిరసన సభ జరపడం విడ్డూరమన్నారు. వైకాపా అధికారంలో ఉన్నప్పుడే, జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే రాయల సీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు లేవంటూ జాతీయ హరిత ట్రిబ్యునల్ 2021 జూలై 7న స్టే ఉత్తర్వులు ఇచ్చింది. తర్వాత వైకాపా మూడు సంవత్సరాలు అధికారంలో ఉంది. ఈ మూడు సంవత్సరాలలో స్టే వెకేట్ చేయించి, అనుమతులు తెప్పించి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదో జగన్మోహన్ రెడ్డి, వైకాపా నాయకులు రాయలసీమ ప్రజలకు చెప్పాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు.

2008-09 రైల్వే బడ్జెట్‌లో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా, మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు కడప -రాయచోటి -మదనపల్లి బెంగళూరు నూతన బ్రాడ్ గేజ్ రైల్వే మార్గాన్ని మంజూరు చేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం 50శాతం, కేంద్ర ప్రభుత్వం 50శాతం నిధులు భరించే విధంగా ఈ ప్రాజెక్టు మంజూరు అయింది. ఈ ప్రాజెక్టు రాయలసీమ సమగ్ర అభివృద్ధికి ఎంతో అవసరం. ఇందులో మొదటి ఫేస్ కడప నుండి పెండ్లిమర్రి వరకు 21 కిలోమీటర్ల లైను పూర్తయింది. వైకాపా అధికారంలోకి వచ్చాక, జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ నిధులు ఇవ్వని కారణంగా రైల్వే శాఖ పనులు నిలిపివేసింది. ఈ ప్రాజెక్టు వద్దని జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో రైల్వే శాఖకు లేఖ రాశారు. ఇంతకంటే రాయలసీమ ద్రోహం మరొకటి ఉంటుందా అని తులసి రెడ్డి ప్రశ్నించారు. ఇటువంటి వాళ్ళు రాయలసీమ గురించి మాట్లాడడం హాస్యాస్పదం కాదా అని తులసిరెడ్డి సూటిగా ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడే 2021 నవంబర్లో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయింది. తర్వాత మూడు సంవత్సరాల పాటు జగన్ ముఖ్యమంత్రిగా వైకాపా అధికారంలో ఉంది. ఈ ప్రాజెక్టు గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. విభజన చట్టంలో 13వ షెడ్యూల్ ప్రకారం కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి. జగన్మోహన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో దీని గురించి పట్టించుకోలేదు. పోనీ ప్రైవేట్ రంగంలోనైనా ఏర్పాటు చేశారా అంటే అదీ లేదు. చేయాలి చెల్లి పెళ్లి మళ్ళీ మళ్ళీ అన్నట్లు రెండు సార్లు శంకుస్థాపన చేశారు తప్ప అంగుళం కూడా ముందుకు కదలలేదు. విభజన చట్టం ప్రకారం రాయలసీమకు, ఉత్తరాంధ్రకు బుందేల్ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులు కేంద్రం రాష్ట్రానికి ఇవ్వాలి. జగన్ ఐదేళ్ల పాలనలో ఒక రూపాయి కూడా రాలేదు. ఈ విధంగా రాయలసీమకు అన్ని విధాల ద్రోహం, మోసం, అన్యాయం చేసిన జగన్మోహన్ రెడ్డి, వైకాపా నాయకులు తగుదునమ్మా అంటూ రాయలసీమ పట్ల మొసలి కన్నీరు కార్చడం విడ్డూరమని విరుచుకు పడ్డారు.

# యువత జీవితాలతో రాజకీయ ఆటలు తగదు

## - ఏఐవైఎఫ్ హెచ్చరిక..




**రాయదుర్గం - సూర్య వాస్తవం :** నిరుద్యోగ యువత ఆశలను తుంచేస్తూ, ఎన్నికల హామీలను గాలికి వదిలేసిన ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జి. సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా సీపీఐ జిల్లా కార్యాలయం నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో, జిల్లా అధ్యక్షులు కోట్రేష్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతకు ఉపాధి కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, తక్షణమే ఉద్యోగ నియామక క్యాలెండర్‌ను ప్రకటించాలని, నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలని, ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను యుద్ధప్రాతిపదికన భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమ యంలో ఇరవై లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం తుంగలో తొక్కిందని, ప్రతి సంవత్సరం విడుదల చేయాల్సిన ఉద్యోగ క్యాలెండర్‌ను ఉద్దేశపూర్వకంగా ప్రకటించ కుండా నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని విమర్శించారు. యువత జీవితాలతో రాజకీయ ఆటలు ఆడటం తగదని ఆయన గట్టి హెచ్చరిక చేశారు. ఇదే సమయంలో తిరుపతిలోని మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో ఫీజుల అవకతవకలను ప్రశ్నించేందుకు వెళ్తున్న విద్యార్థి నేతలు అలీ అక్బర్, వినోద్ కుమార్‌లను అపహరించి దాడి చేయడం నియంతృత్వ ధోరణికి నిదర్శనమని ఏఐవైఎఫ్ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనకు సంబంధించి యూనివర్శిటీ ప్రజాసంబంధ అధికారి, భద్రతా సిబ్బందితో సహా 13 మందిని పోలీసులు అరెస్టు చేయడం కేవలం మొదటి అడుగు మాత్రమేనని, ఈ దాడి వెనుక ఉన్న నటుడు మోహన్ బాబు, ఆయన కుమారుడు మంచు విష్ణు పాత్రపై కూడా సమగ్ర విచారణ జరిపి, బాధ్యులందరిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసి ఉద్యమాలను అణచివేయాలని ప్రయత్నిస్తే ప్రజా ఉద్యమాలు మరింత ఉధృతమవుతాయని హెచ్చరించారు. యువతకు ఉపాధి, విద్యార్థులకు భద్రత, ప్రజలకు న్యాయం సాధించే వరకు అఖిల భారత యువజన సమాఖ్య పోరాటం ఆగదని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత విస్తృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ధనుంజయ, ఉపాధ్యక్షులు సామ్యూల్, కోశాధికారి శ్రీనివాస్, నగర నాయకులు రియాజ్, తేజ, నందా, తేజస్విన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా శాఖ జేడీని కలిసిన అపుస్మా ప్రతినిధులు



**అనంతపురం- సూర్య వాస్తవం:** విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ సుబ్బారావును ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ అనంతపురం జిల్లా శాఖ ప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనను అపుస్మా రాష్ట్ర చీఫ్ కో - ఆర్డినేటర్ కుసుమ పుల్లారెడ్డి, గౌరవాధ్యక్షుడు నాయుడు, జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, నగర్ అధ్యక్షుడు శశిభూషణ్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు నాగరాజు, అసోసియేషన్ ప్రతినిధులు ఇక్బాల్, మధుసూదన్ రెడ్డి, మోహన్ రెడ్డి, లోకనాథ్ తదితరులు కలిసారు. తమ సమస్యలపై వినతిపత్రం అందించారు. ముఖ్యంగా అరెస్టెడ్ ఫైల్స్, రెన్యువల్ ఫైల్స్ సమర్పించేందుకు 2025 అక్టోబర్ 31 చివరి తేదీగా ప్రకటించారని అందులో పేర్కొన్నారు. నిర్ణయించిన రుసుముతో, ప్రతి నెలా అపరాధ రుసుముతో రూ.2 లక్షలుగా నిర్ణయించినట్లు వివరించారు. అయితే 2025 డిసెంబర్ 31 వరకు గడువు ఉన్నట్లు తమకు తెలియదని అందులో తెలిపారు. నిర్దేశిత రుసుము చెల్లించిన వారు, చెల్లించని వారు ఇంకా చాలా మంది ఉన్నారని గుర్తు చేశారు. ఈ విషయం జూన్, జూలైలో విద్యా శాఖ అధికారులు తమకు తెలిపి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని గడువు పెంచి తమకు మరో అవకాశం కల్పించాలని కోరారు. రెన్యువల్, రికగ్నైజేషన్ ఫైల్స్ విషయంలో కూడా తమకు మరింత గడువు ఇచ్చేలా చొరవ తీసుకోవాలని విన్నవించారు.



# పేద కుటుంబానికి మౌలానా ఆపన్న హస్తం...

## - నిత్యవసర సరుకులు పంపిణీ

**అనంతపురం- సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా కాంగ్రెస్ పార్టీకి చెందిన మైనారిటీ నాయకులు మౌలానా నవాజ్ బియాబానీ చిష్తిఉల్ ఖాద్రీ నగరంలోని హోసింగ్ బోర్డు కాలనీ కు చెందిన పేద కుటుంబానికి నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. తన ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న సంగతి ఐ.ఏం.ఏం మహబూబ్ బాషాకు తెలిపింది. ఆయన ఆమె దీనస్థితిని మౌలానా నవాజ్ సాహెబ్ కు తెలియజేసిన వెంటనే స్పందించి ఆయన ఆర్థిక సహాయార్థం ఆ కుటుంబానికి అండగా నిత్య అవసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా మౌలానా నవాబ్ మాట్లాడుతూ.... ధనవంతులు పేదలను ఆదుకోవడం, సహాయం చేయడం ఒక సామాజిక నైతిక బాధ్యత. ఇది పేదరిక నిర్మూలనకు, సమాజంలో అసమానతలు తగ్గించడానికి సహాయపడుతుందని ఆహారం, విద్య, వైద్యం వంటి ప్రాథమిక అవసరాలు తీర్చడం, ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపవచ్చున్నారు. అల్లాహ్ దయ వల్ల రానున్న రోజుల్లో పేద ముస్లింలతో పాటు కులమతాలకతీతంగా అన్నివర్గాల పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ చేస్తామన్నారు. ఐ ఎం ఎం మహబూబ్ బాషా మాట్లాడుతూ మౌలానా నవాజ్ సాహెబ్ సేవ నిరతి అభినందనీయం అని వారి సేవ నిరతి విరామం లేకుండా కొనసాగడం గొప్ప విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జబియుల్లా సయ్యద్ బాషా తదితరులు పాల్గొన్నారు

# ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

## - మండల వైసీపీ కన్వీనర్ దేవి రెడ్డి శ్రీకాంత్ రెడ్డి



**సింహాద్రిపురం - సూర్య వాస్తవం :** సింహాద్రిపురంలోని స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైసీపీ మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. వీటిలో భాగంగా అనుభవజ్ఞులైన డాక్టర్లచే ప్రాథమిక పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తామన్నారు. ఈ వైద్య శిబిరానికి వచ్చే వారు హెల్త్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు తమ వెంట కలిగి ఉండాలని తెలియజేశారు.

# ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్



**పులివెందుల - సూర్య వాస్తవం:** పులివెందుల మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (రమణప్ప సత్రం)లో పిఎస్‌హెచ్ ఎమ్ వి.వరలక్ష్మి ఆధ్వర్యంలో నిన్న ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు అందరు తమ తమ ఆరోగ్యకరమైన ఆహారపదార్థాలతో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని అలరించారు. ఈ సందర్భంగా పిఎస్‌హెచ్‌ఎమ్ వరలక్ష్మి మేడం మాట్లాడుతూ ఆహారం ఔషదం, ఆహారం అమృతం, ఆహారం ఓ ఆప్యాయత, ఆహారం మన సంస్కృతి, ఆహారం మన ఎమోషన్ అని.. మరి అలాంటి ఆహారం వండాలంటే, అది కూడా రుచిగా వండాలంటే ఎంతో ఓర్పు, నేర్పు ఉండాలని.. ఆహారం వండడం లో లింగ సమానత్వ భావన పెంపొందించడం కోసం, భవిష్యత్ మాస్టర్ చెఫ్ లను రూపు దిద్దడం కోసం కేవలం చిన్న ప్రయత్నం ఈ ఫుడ్ ఫెస్టివల్ అండ్ మాస్టర్ చెఫ్ కాంపిటీషన్ అని తెలియ జేసారు. కార్పొరేట్ పాఠశాలకు ఏమాత్రం తగ్గకుండా ఉపాధ్యాయ బృందం అందరూ చక్కగా ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మండల విద్యా శాఖ అధికారి 2 రామా నాయుడు విచ్చేసారు... ఈ కార్యక్రమలో సిఆర్‌పి ఓబు లేసు, పాఠశాల ఉపాధ్యాయులు సూర్యనారాయణ రెడ్డి సర్, సుమాంజలి, శిరీష తల్లి దండ్రులు పాల్గొన్నారు. పాల్గొన్న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు.

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు




**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం :** పేద, ధనిక తేడా లేకుండా విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈఓ చక్రే నాయక్, వెంకటసుబ్బయ్యలు పేర్కొన్నారు. గురువారం స్థానిక జడ్పీ ఉన్నత బాలుర పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ చక్రే నాయక్, వెంకటసుబ్బయ్యలు మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లి జడ్పీ బాలుర పాఠశాలలో 60 సంవత్సరాలుగా ఎంతోమంది విద్యనభ్యసించి గొప్ప గొప్ప పదవులను అలంకరించారని ఆయన గుర్తు చేశారు. ఈ పాఠశాలలో చదివిన వారు ఎంతోమంది ఉద్యోగాలు చేసి రిటైర్మెంట్ అయ్యారని ఆయన గుర్తు చేశారు. అలాంటి పాఠ శాలలో పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించి ముందుకు వెళుతుందని ఈ ఏడాది కూడా మార్చిలో జరగబోవు 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి ఉజ్వల భవిష్యత్తు పొందాలని వారన్నారు. లక్కిరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత బాలురు పాఠశా లకు ఎంతో పేరు ప్రతిష్టలు ఉన్నాయని ఆ పేరు నిలబెట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమేష్, ఏపీ మోడ ల్ స్కూల్ ప్రిన్సిపాల్ వరాల రమేష్, సుబ్బరాయుడు, సూర్యుడు, నాయక్ పకీరయ్య, హెచ్‌సి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

## - ఏఈ జి. సుబ్బరాయుడు

**వేంపల్లె - సూర్య వాస్తవం :** వేంపల్లి పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాలు జరిపి లైన్ పనులు చేస్తుండటంతో శుక్రవారం కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సుబ్బరాయుడు తెలిపారు. నాలుగు రోడ్ల కూడలి ఏరియా, గాంధీ రోడ్డు, జిఎం కాంప్లెక్స్, రంగయ్య హాస్పిటల్ ఏరియా, హైస్కూల్ ఏరియా, పాత జీపుల్ స్టాండ్ ఏరియా, ఆటో స్టాండ్ ఏరియాలలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

# రెవెన్యూ మ్యుటేషన్ల అర్జీలను క్షేత్రస్థాయిలో
# వివరణాత్మకంగా పరిష్కరించాలి

- రీ సర్వే కార్యక్రమంలో జాయింట్ ఎల్పీఎంలు తక్కువగా ఉండేలా చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్
- భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత, మ్యుటేషన్ ప్రక్రియను వేగవంతం చేయడమే లక్ష్యంగా రెవెన్యూ సిబ్బందికి శిక్షణ




**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం :** రెవెన్యూ మ్యుటేషన్ల అర్జీలను క్షేత్రస్థాయిలో వివరణాత్మకంగా నాణ్యతతో పరిష్కరించా లని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశిం చారు. గురువారం ఉదయం అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లి లోని పిపిఆర్ కళ్యాణ మండపంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా లోని అన్ని గ్రామాల వీఆర్వోలు గ్రామ సర్వేయర్లు అన్ని మండలాల ఆ రైలు డిప్యూటీ తాసిల్దారులు తహాశీల్దారులకు భూముల మ్యుటేషన్ల పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకతను పెంపొందించడం, మ్యుటేషన్ ప్రక్రియను వేగవంతం చేయడం, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నామని పేర్కొన్నారు. మ్యుటేషన్‌కు సంబంధించిన నిబంధనలు, విధానాలు, కాలపరిమితులపై అధికారులకు సమగ్ర అవగాహన, ఆన్‌లైన్ మ్యుటేషన్ సిస్టమ్ వినియోగంలో సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించ డంతో పాటు భూ రికార్డుల ధృవీకరణలో ఖచ్చితత్వాన్ని మెరుగుపరచే అంశాలపై రెవెన్యూ సిబ్బంది ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా ప్రజలు సమర్పించే మ్యుటేషన్ల అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆర్జిదారులతో ఫోటో తీసుకుని పక్కాగా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. గ్రామాల వారిగా మ్యుటేషన్ల కు సంబంధించి రిజిస్టర్ లను నిర్వహించాలని, మ్యుటేషన్లను తిరస్కరిస్తే ఎందుకు తిరస్కరించామో స్పష్టమైన కారణాలతో స్పీకింగ్ ఆర్డర్ ఇవ్వాలని, తిరస్కరణకు సంబంధించిన వివరాలను రిజిస్టర్లో మరియు ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. మ్యుటేషన్లను ఆమో దిస్తే అర్జిదారుల చట్టపరమైన వారసుల వివరాలను, అమ్మకపు పత్రాలను, కుటుంబ వివరాలను పక్కగా చూసి సరిదిద్దాలన్నారు. మ్యుటేషన్ల తిరస్కరణ, ఆమోదాలకు సంబంధించి అక్రమ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ పై మాట్లాడుతూ పాసు పుస్తకాలలో తప్పులు ఉంటే నిర్ణీత కాల వ్యవధిలో తప్పులు సరిచేసి నూతన పట్టాదారు పాస్ పుస్తకాన్ని అర్జీదారులకు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు.

మార్చి, ఏప్రిల్ నెలలలో జరగబోయే పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ నిర్నీత కాలవ్యవధిలో పూర్తవాలని ఆదేశించారు. జిల్లాలో చేపడుతున్న రీ సర్వేకు సంబంధించి జాయింట్ ఎల్పీఎంలు తక్కువగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ముటేషన్లను నాణ్యతతో పరిష్కరించిన బి కొత్తకోట మండలం కురబలకోట గ్రామ వీఆర్వో బి శ్రీనివాసులును అభినందించారు. ఆగస్టు 15 కు ఉద్యోగులకు అందించే ప్రశంసా పత్రాల జాబితాలో శ్రీనివాసులును చేర్చాలని ఆదేశించారు. ముటేషన్లకు సంబంధించిన అర్జీలను నాణ్యతతో ఏ విధంగా పరిష్కరించాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మదనపల్లి సబ్ కలెక్టర్ కళ్యాణి, జిల్లా కలెక్టరేట్ లోని ల్యాండ్ సెక్షన్ సూపర్ ఇంటెండెంట్ శ్రావణి రెవెన్యూ సిబ్బందికి వివరించారు. ముటేషన్ల పరిష్కారంలో ఎక్కడ తప్పులు దొర్లుతాయి వాటిని ఏ విధంగా సరిదిద్దాలి వంటి అంశాలను రెవిన్యూ సిబ్బందికి ఆమె వివరించారు. మ్యుటేషన్ ప్రక్రియలో దరఖాస్తు స్వీకరణ నుండి పట్టాదారు పాస్‌బుక్ జారీ వరకు ఉన్న వివిధ దశలను శిక్షణలో సవివరంగా వివరించారు. మీసేవ లేదా గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తుల స్వీకరణ, తహాశీల్దార్ ద్వారా అడంగల్ పరిశీలన మరియు ఫారం--8 నోటీసు జారీ, వీఆర్వోల ద్వారా క్షేత్రస్థాయి విచారణ, సబ్ కలెక్టర్ లేదా ఆర్డిఓ స్థాయిలో పరిశీలన అనంతరం తుది ఆమోదం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ శివ నారాయణ శర్మ, మదనపల్లి సబ్ కలెక్టర్ కళ్యాణి, డిఆర్ఓ మధుసూదనరావు, రాయచోటి పీలేరు డివిజన్ల ఆర్డీవో శ్రీనివాస్, సర్వే శాఖ ఏడి భరత్ కుమార్, కలెక్టరేట్ రెవెన్యూ సిబ్బంది, జిల్లాలోని రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ నివారణపై అవగాహన వైద్య శిబిరం




**కనేకల్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా కణేకల్ మండలం జక్కలవడికి గ్రామంలో హెచ్ఐవీపై అవగాహన వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం ఆదేశాల మేరకు ఈ శిబిరాన్ని యర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యర్రగుంట పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డా. మల్లీశ్వరి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. డీ.ఆర్.పి. రమేష్ యాదవ్ హెచ్ఐవీ పై అవగాహన కల్పిస్తూ, హెచ్ఐవీ ఎలా వ్యాప్తి చెందుతుందో, ఎలా వ్యాప్తి చెందదో వివరించారు. అలాగే హెచ్ఐవీతో జీవిస్తున్న వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తూ, ప్రతి ఒక్కరూ భయాన్ని, సంకోచాన్ని వీడి హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎంపీహెచ్ ఈఓ తిరుపాల్ నాయక్ బీపీ, షుగర్ వంటి జీవనశైలి వ్యాధులపై అవగాహన కల్పిస్తూ, వాటిని నియంత్రిం చేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జోనల్ సూపర్వైజర్ శ్రీరాములు టీబీ వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ల్యాబ్ టెక్నీషియన్ పద్మలత హెచ్ఐవీతో జీవిస్తున్న వారిపై ఎలాంటి వివక్ష చూపకూడదని, వారికి సమాజం అండగా ఉండాలని తెలిపారు. ఏఎన్ఎం ఇందిరా గర్భిణీలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, పౌష్టికాహారం ప్రాముఖ్యతపై వివరించారు. ఈ వైద్య శిబిరంలో హెచ్ఐవీ పరీక్షలతో పాటు బీపీ, షుగర్, హెచ్‌బీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో యర్ర గుంట పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డా. మల్లీశ్వరి, ఎంపీహెచ్ఈఓ తిరుపాల్ నాయక్, ఎంపీహెచ్ఏ మురళీ కృష్ణ, ల్యాబ్ టెక్నీషియన్ పద్మలత, ఏఎన్ఎం ఇందిరా, ఎం.ఎల్.హెచ్.పి రాజేశ్వరి, జోనల్ సూపర్వైజర్ శ్రీరాములు, లింక్ వర్కర్లు నాగేంద్ర, నాగరాజు, 104 సిబ్బంది వన్నూరు, అజయ్ కుమార్‌తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన ఉండాలి

- అనంతపురం ఎస్పీ పి.జగదీష్



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన ఉండాలని ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. గురువారం నాడు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధుల్లో నూతన క్రిమినల్ చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపట్టారు. ఈ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా నూతన క్రిమినల్ చట్టాలు మహిళల భద్రత, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళలపై నేరాలకు సంబంధించిన చట్టపరమైన రక్షణలపై ప్రజలకు విస్తృతంగా వివరించారు. మహిళలపై జరుగుతున్న నేరాలపై కఠినమైన చట్టాలు అమల్లో ఉన్నాయని, ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం అందిస్తున్న వివిధ హెల్ప్‌లైన్లు, చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాల విషయంలో ఫేక్ కాల్ఫిషింగ్ లింకులు, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.రోడ్డు భద్రత అంశంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, మద్యం తాగి వాహనం నడపకూడదని ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.





# శ్రీ వృషభచలేశ్వర దేవస్థానం హుండీ లెక్కింపు

**వేంపల్లె - సూర్య వాస్తవం :** శ్రీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయములందు గురువారం హుండీల లెక్కింపు నిర్వ హించారు. సదరు హుండీల లెక్కింపు ద్వారా శ్రీ వృషభాచలేశ్వర స్వామి (ఎద్దుల కొండపైన) ఆలయంలో రూ.1,46,303లు, శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలోరూ. 52,892లు, శ్రీ వెంక టేశ్వర స్వామి వారి దేవస్థానంలో రూ2,27,449లు. మూడు ఆలయముల ద్వారా మొత్తం రూ.4,26,644 ఆదాయం పది మాసములకు వచ్చినది. సదరు హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవదాయ శాఖ పొద్దుటూరు డివిజన్ తనిఖీదారులు ఏ.కిరణ్ కుమార్ రెడ్డి, దేవస్థానం చైర్మన్ పి.వి రమణ, సభ్యులు అద్దంకి రామయ్య, జూటూరు జ్యోతి, రాజమ్మ, దేవస్థానం ప్రధాన అర్చకులు హరి ప్రవీణ్, అర్చకులు తిరుమల వేణు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు జి.రామకృష్ణ , ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# క్యాన్సర్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన



**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం:** మండల కేంద్రంలోని గోవిందమాంబ బాలికల పాఠశాల యందు గురువారం స్థానిక పిహెచ్సి వైద్యాధికారి సంపత్ కుమార్ క్యాన్సర్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి ఏ విధంగా వస్తుంది. ఈ వ్యాధి రాకుండా ఏ విధంగా మనం ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. క్యాన్సర్ వ్యాధిని ఎలా గుర్తించాలి, క్యాన్సర్ వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయి అనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బ్రహ్మం సాగర్ కాలువలో గుర్తు తెలియని శవం లభ్యం



**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం :** బ్రహ్మంగారిమఠం మండలం జోకుపల్లె గ్రామం వద్ద ఉన్న తెలుగు గంగ బ్రహ్మం సాగర్ కాలువలో గుర్తుతెలియని శవం తేలియాడుతున్నట్లు స్థానికులు గుర్తించి స్థానిక ఎస్సై శివప్రసాద్ కు విషయం తెలియజేయగా వారు తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. కాలువలో తేలీడుతున్న శవాన్ని స్థానికుల సాయంతో ఒడ్డుకు చేర్చారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ సుమారు 30 సంవత్సరాల వయస్సు కలిగిన మగ వ్యక్తి శవాన్ని గుర్తించడం జరిగిందని తన వివరాలు మీడియా ద్వారా అందరికీ చేరవేసామని ఎవరైనా తెలిస్తే పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

# సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అవార్డు అందుకున్న కెఎస్‌కే సునీల్, రఫీ

### - సన్మానించిన గుత్తి వర్కింగ్ జర్నలిస్టులు

**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలో ఆర్ఎంబంగ్లాలో జరిగిన సన్మాన కార్యక్రమంలో 8వ అనంత షార్ట్ ఫిలిం ఫెస్టివల్లో ఉత్తమ సోషల్ మీడియా విభాగంలో అవార్డులు గెలుచుకున్న గుత్తి జర్నలిస్టులు రఫీ, సునీల్‌లను గురువారం ఘనంగా సన్మానించారు. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో వర్కింగ్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. అవార్డు గ్రహీతలతో పాటు సీనియర్ జర్నలిస్ట్ తన్నీరును కూడా గౌరవించారు. జర్నలిస్టుల ప్రతిభ గుత్తి ప్రాంతానికి గర్వకారణమని ఈ సందర్భంగా సహచరులు కొనియాడారు.



# రాష్ట్రం రాయదుర్గం వైపు చూసేలా అభివృద్ధి చేస్తాం

**- సీఎం సహకారంతో రాయదుర్గానికి అభివృద్ధి బాటలు..**
**- రాయదుర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా మారుస్తా!**
**- ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు**



**రాయదుర్గం – సూర్య వాస్తవం :** రాబోవు రోజుల్లో రాయదుర్గం నియోజకవర్గాన్ని అభివృద్ధికి అసలు సిసలు చిరునామాగా మారు స్తానని ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు ప్రకటించారు. రాయదుర్గం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణంలో గురువారం నిర్వహించిన ఇంటిపట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన అనుభవం, దార్శనికత, వ్యక్తిగత పరిచయాలతో పాటు నిరంతరం శ్రమించేతత్వం నేడు ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు దూసుకెళ్లేలా చేస్తున్నాయన్నారు. వీటితో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆశీస్సులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారం, మంత్రి నారా లోకేష్ సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యతతో రాష్ట్రం సంక్షోభం నుంచి గట్టెక్కగలుగుతోందన్నారు. ఇతర దేశాల నుండి ఆంధ్ర రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వరదలా తరలిరావడం వెనుక వీరి కఠోర శ్రమ ఉందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించడం, పెట్టుబడిదారులను మెప్పించడం ఆషా మాషీ వ్యవహారం కాదన్నారు. కూటమి పాలనపై సంపూర్ణ విశ్వాసంతో వందల మంది రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ముందుకొస్తున్నారన్నారు. వీటి ద్వారా లక్షలాది మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. మరోవైపు రాష్ట్రంలో మౌలిక వసతులు, రహదారులు, వ్యవసాయ, సాగునీటి ప్రాజెక్టులకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమం కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. ముఖ్యంగా పెన్షన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, మహిళలకు, బాలికలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, అన్నదాతలకు పెట్టుబడి రాయితీ, తల్లికి వందనం పేరుతో చదువుకుంటున్న పిల్లలకు ఆర్థిక సహాయం లాంటి అనేక సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని తూచా తప్పక చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ కలలుగన్న సంక్షేమ శ్రేయో రాజ్య స్థాపనలో భాగంగా ఇల్లులేని ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వడమే లక్ష్యంగా చంద్రబాబు ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అందులో భాగంగా రాయదుర్గం నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు 4126 మంది పేదలకు ఇళ్ల పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లను పంపిణీకి సిద్ధం చేశామన్నారు. ఈరోజే భారీ స్థాయిలో 3వేల మందికి పట్టాలు పంపిణీ చేయడం తన జీవితంలో మర్చిపోలేనన్నారు. రాయదుర్గం నియోజకవర్గ సంక్షేమ చరిత్రలో ఈరోజు నిజంగా సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ అధ్యాయమని కాలవ హర్షం వ్యక్తపరిచారు. భవిష్యత్తులో పేదలకు పూర్తిస్థాయిలో శాశ్వత గృహ నిర్మాణం అమలు చేసి తీరతామన్నారు. రాయదుర్గాన్ని అన్ని విధాల పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

**వైసీపీకి ఆ చిత్తశుద్ధి ఏదీ..?**

2019 ఎన్నికల్లో ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలను వైసీపీ ప్రభుత్వం నయవంచనకు గురిచేసిందని కాలవ ఈ సందర్భంగా ధ్వజమెత్తారు. ఐదేళ్ల పాలనలో ఏనాడు జగన్ రెడ్డి ప్రజల అవసరాలు గుర్తించి అందుకు అనుగుణంగా పనులు చేపట్టలేదన్నారు. ప్రతి అడుగులోనూ స్వార్థం, రాజకీయ లబ్ధి, వ్యక్తిగత ప్రయోజనాలనే అప్పట్లో జగన్మోహన్ రెడ్డితో పాటు ఆ పార్టీ నాయకులు చూసుకున్నారన్నారు. రైతుల పట్ల సీమ ప్రయోజనాల పట్ల సీమ భవిష్యత్తు పట్ల ఏనాడు ఆలోచించిన పాపాన పోలేదన్నారు. బలితెగింపు రాజకీయాలతో పబ్బం గడుపుకుంటూ కాలయాపన చేస్తూ రాష్ట్రాన్ని ముఖ్యంగా రాయలసీమ ప్రాంతాన్ని మరింత వెనుకబాటుకు గురిచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీమ వెనుకబాటును బూచిగా చూపుతూ తీరని ద్రోహం చేసిన ఈ నాయకులు నేడు కూటమి ప్రభుత్వంపై బురద చల్లటానికి ప్రయత్నిస్తూన్నారని విమర్శించారు. 2017లో గత టిడిపి ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లతో ప్రారంభించిన హంద్రీనీవా విస్తరణ పనులను జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పూర్తిగా ఆపివేసిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా గడిచిన ఆరున్నర ఏళ్ల కాలంలో సుమారు 20వేల కోట్లు సాగునీటి ప్రాజెక్టుల కోసం ఖర్చు చేయగా, జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో కేవలం రూ.2వేల కోట్లు మాత్రమే వ్యయం చేశానన్నారు. సీమ ద్రోహులుగా మిగిలిపోయిన వైసీపీ వారిని ఒకసారి గెలిపించినందుకే రాష్ట్రాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయేలా చేశారన్నారు. దుర్మార్గ రాజకీయ చరిత్ర కలిగిన వైకాపా నేతల పట్ల ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలని గుర్తు చేశారు. రాజకీయ పబ్బం గడుపుకొనే వైకాపా నేతలను మరోసారి క్షమించే స్థితిలో సీమ ప్రజలు లేరని జోష్యం చెప్పారు.

**మా మంచి దేవుడు చంద్రబాబు...**

రాయదుర్గం నియోజకవర్గ అభివృద్ధి విషయంలో చంద్రబాబు నోటివెంట లేదన్న మాట ఇప్పటివరకు వినలేదన్నారు. గత టిడిపి పాలనలో అయినా, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో నైనా రాయదుర్గం ప్రాంతంపై ఆయనకు ఎనలేని ప్రేమ, మమకారం, ఆప్యాయత కొనసాగుతున్నాయన్నారు. తాను ఎప్పుడూ ఏ ఫైల్ తీసుకెళ్లిన మంజూరు చేస్తూ వస్తున్నారన్నారు. సంబంధిత అధికారులకు కూడా తన పనులు ఏమైనా ఉంటే త్వరగాచేసి పంపమని ఆదేశాలు ఇస్తున్నారన్నారు. తనపట్ల ఆయన చూపుతున్న ఆప్యాయత ఎన్నటికీ మరచిపోలేనన్నారు. ఆయన నాయకత్వంలో పని చేస్తున్నందుకు చాలా గర్వంగా ఉందన్నారు. ప్రతి ఇంట్లో దేవుడికి దండం పెట్టుకునే సమయంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు రాష్ట్రానికి సుదీర్ఘ కాలం పాటు కొనసాగేలా పేదలు ప్రార్థించాలన్నారు. ప్రజల సహకారంతో ఆయన రాష్ట్రానికి మరెంతో సేవ చేయాలని కోరుకోవాలని ఎమ్మెల్యే కాలవ సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గొడిసెల పల్లి హనుమంత రెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టరులు నాగల్లీ రాజు, పోరాళ్ల పురుషోత్తం, ఉప్పర ఆనంద్, పట్టణ టిడిపి అధ్యక్షుడు బండి కృష్ణమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు లాలేప్ప, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పసుపులేటి నాగరాజు, మండలాల కన్వీనర్లు కాలవ సన్నన్న, మోహన్ రెడ్డి, వన్నారెడ్డి, హనుమంతుతో పాటు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల వెంకటేశులు, కడ్డిపూడి మహబూబ్ బాషా, పూజారి శివప్రసాద్, కౌన్సిలర్ పద్మావతి, ప్రశాంతి, బండి భారతి, ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు మహిళలు తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు..



# కార్యకర్త నుంచి ఎమ్మెల్యే వరకు వచ్చాను

**- కష్టపడితే పార్టీ గుర్తింపిస్తుందనటానికి నేనే ఉదాహరణ**
**- క్లస్టర్ ఇన్‌ఛార్జిల సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి**
**- సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని ఎమ్మెల్యే పిలుపు**



**అనంతపురం – సూర్య వాస్తవం:** తెలుగుదేశం పార్టీలో కష్టపడితే గుర్తింపు వస్తుందనటానికి తానే ఒక ఉదాహరణ అని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురం అర్బన్ నూతన టిడిపి కార్యాలయంలో పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. 10, 11 క్లస్టర్ ఇన్ ఛార్జిలు, కో క్లస్టర్, డివిజన్, బూత్ ఇన్‌ఛార్జిలతో ఈ సమావేశం జరిగింది. బూత్ ల వారీగా ఉన్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. చాలామంది వారి వారి పరిధిలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వాటన్నింటినీ కచ్చితంగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024లో భారీ మెజార్టీతో నన్ను గెలిపించారని.. దీనిని ఎప్పటికీ మరువనన్నారు. 60 ఏళ్ల రాజకీయ అనుభవమున్న అనంత వెంకట్రామిరెడ్డిని ఓడించానంటే... అది మీ అందరి కృషి వల్ల అని అన్నారు. గతంలో ఒక సామాన్య కార్యకర్త నుంచి తన ప్రయాణం మొదలైందన్నారు. ఈరోజు నన్ను ముఖ్యమంత్రి చంద్రబాబు గారు, మంత్రి నారా లోకేష్ గారు, ఎమ్మెల్యే స్థాయి వరకు తీసుకొచ్చారన్నారు. ఒక సామాన్యుడు కూడా తెలుగుదేశం పార్టీలో ఏ స్థాయికి వెళ్తారో చెప్పడానికి నేనే ఒక ఉదాహరణ అన్నారు. గతంలో ప్రధాని చేతుల మీదుగా బెస్ట్ ఎంపీపీ అవార్డ్ అందుకున్నానని, పంచాయతీరాజ్ స్టేట్ కమిటీ సభ్యుడిగా పనిచేసిన విషయాన్ని గుర్తు చేశారు. జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కృషి తో కోటి సభ్యత్వాలు సాధ్యమయ్యాయన్నారు. అనంతపురంలో గతంలో 23వేలు సభ్యత్వాలు ఉంటే.. నేడు 78వేల సభ్యత్వాలు చేశామన్నారు. ఒక సుదీర్ఘ లక్ష్యంతో తాను పనిచేస్తున్నానని చిన్నచిన్న వాటికి భయపడే పరిస్థితి లేదన్నారు. గత 20 నెలల్లో గతంలో ఎప్పుడు లేని విధంగా అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. పార్టీలకతీతంగా సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదలను ఆదుకుంటున్నట్లు చెప్పారు. మునుపెన్నడు లేనివిధంగా అనంతపురం నియోజకవర్గానికి ఎక్కువగా నామినేటెడ్ పదవులు వచ్చాయని..11 మందికి స్టేట్ డైరెక్టర్లు, చైర్మెన్‌లుగా అవకాశం కల్పించారన్నారు. యువతకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తోందన్నారు. మనం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక కొందరు నన్ను దెబ్బతీయడానికి పార్టీని అప్రతిష్ట పాలు చేయడానికి బురద చల్లుతున్నారని... ఇలాంటి పార్టీ అధిష్టానం గమనిస్తోందన్నారు. సోషల్ మీడియాలో మనపై వస్తున్న ఆరోపణలను యువత తిప్పి కొట్టాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు.



# టీడీపీ యువజన అధ్యక్షుడిగా కిరణ్ పేరు ఖరారు కావాలి

**రాపూరు– సూర్య వాస్తవం:** త్వరలో జరగబోయే పార్టీ గ్రామ కమిటీ నియామకాల్లో భాగంగా, పట్టణ తెలుగుదేశం పార్టీ నియమించబోయే, యువజన విభాగం అధ్యక్ష పదవికి చురుకైన నాయకుడు గజరా కిరణ్ పేరును ప్రతిపాదించాలని కోరుతున్నామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పార్టీ విపక్షంలో ఉన్నప్పుడు రాజకీయ వేధింపులు ఎదురైనా గజరా కిరణ్ వెనకడుగు వేయకుండా పార్టీ జెండాను మోశారని గుర్తు చేస్తున్నాము. పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కిరణ్ కీలక పాత్ర పోషించాడు. గత ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాల్లో చురుగ్గా పాల్గొంటూ మల్లమ్మగుంట, పడమర వీధి, కుమ్మరి వీధి నంధు కార్యకర్తలను సమన్వయం చేస్తూ పార్టీ పటిష్టతకు కృషి చేసాడు.. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో, పార్టీ కోసం కష్టపడిన నిబద్ధత గల యువ నాయకులకు గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉందని టీడీపీ పార్టీ భావిస్తున్నపుడు గజరా కిరణ్ లాంటి నాయకుడికి బాధ్యతలు అప్పగిస్తే, రాపూరు పట్టణంలో యువతను పార్టీ వైపు మరింతగా ఆకర్షించవచ్చని భావిస్తున్నారు.

**అధిష్టానం దృష్టికి ప్రతిపాదన**

గజరా కిరణ్ సేవలను గుర్తించి, ఆయనను రాపూరు పట్టణ యువత అధ్యక్షుడిగా నియమించాలని, పార్టీ పట్ల ఆయనకున్న విధేయత, పనితీరును పరిగణనలోకి తీసుకొని ఈ నియామకంపై ప్రభుత్వం ద్రుష్టి సాధించాలని కోరుతున్నామని అన్నారు.

# పెంచలకోన హుండీలు లెక్కింపు



**రాపూరు– సూర్య వాస్తవం:** జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన క్షేత్రంలో బుధవారం హుండీల లెక్కింపు చేపట్టారు. నగదు రూ 35,36,474, బంగారం 24గ్రాములు, వెండి 691 గ్రాములు, విదేశీ కరెన్సీ కూడా వచ్చినట్లు, ఈ రాబడి 30 రోజులకు గాను వచ్చినట్లు, దేవస్థానం అధికారులు తెలిపారు.

# చలో పోతిరెడ్డిపాడు కార్యక్రమానికి తరలిన వైసీపీ నాయకులు



**పులివెందుల – సూర్య వాస్తవం:** రాయలసీమకు వ్యతిరేకంగా పక్క రాష్ట్ర ముఖ్యమంత్రికి సహకరిస్తూ నీటి నిల్వలకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న కుట్రను నిరసిస్తూ వైకాపా పార్టీ ఆధ్వర్యంలో నంద్యాలలో నిర్వహించిన కార్యక్రమానికి పులివెందుల వైకాపా నాయకులు తరలి వెళ్లారు. దివంగత నేత రాజశేఖర్ రెడ్డి హయాంలో నిర్మాణానికి పూనుకున్నటువంటి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ సామర్థ్య పనులను చంద్రబాబుతో సాన్నిహిత్యం కారణంగానే నిలుపుదల చేయించాను అన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో కూటమి ప్రభుత్వ తీరుపై ఆంధ్ర రాష్ట్ర ప్రజలు మరియు రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తుండగా వాటికి అనుగుణంగానే వైకాపా ఆధ్వర్యంలో చలో పోతిరెడ్డిపాడు కార్యక్రమాలు చేపట్టగా పులివెందుల నుండి వైకాపా నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, మైనార్టీ నాయకులు నూరుల్లా, రాయుడు, దాసరి చంద్రమౌళి, ఇతర నాయకులు పాల్గొన్నారు.





# దేవగుడి భూపేష్ రెడ్డి ప్రమాణ స్వీకారం విజయవంతం చేద్దాం

### - టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు మిద్దె మురళి

**పులివెందుల - సూర్య వాస్తవం :** కడప నగరంలోని సున్నం బట్టీల సమీపంలో నూతనంగా నిర్మించిన తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణలో శనివారం ఉదయం 10 గంటలకు అత్యంత వైభవంగా జిల్లా అధ్యక్షునిగా ప్రమాణస్వీకారం జరగనుంది. ఈ సందర్భంగా తొండూరు మండలం మదూరు గ్రామం తన స్వగృహంలో మిద్దె మురళి మాట్లాడుతూ చదిపిరాళ్ల రాజకీయ వారసుడిగా 2021 సంవత్సరంలో జమ్మలమడుగు టిడిపి ఇంచార్జ్ గా బాధ్యతలు తీసుకున్నప్పటినుంచి ప్రతి ఒక కార్యకర్తకు అండగా ఉంటూ ప్రతి పేదవారి వారి సమస్యలు తీరుస్తూ అండగాఉంటూ రాజకీయంగా అంచలంచెలుగా ఎదిగి కడప ఎంపీగా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోవడం జరిగింది. అయినా కూడ ఎక్కడ జంకకుండా పేదవారి సమస్యలు తీరుస్తూ కార్యకర్తలకు అండగా ఉంటూయువతి యువకులకు ఉపాధి చూపిస్తూ మరియు అభివృద్ధి చేస్తూ ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నారా లోకేష్ తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలు ఏవి అప్పజెప్పిన అందరినీ కలుపుకొని విజయవంతం చేస్తూ ఉన్నారు పార్టీ గుర్తించి కడప జిల్లా టిడిపి అధ్యక్షులుగా నియమించారు. అదేవిధంగా ఈ కార్యక్రమాన్ని జిల్లాలో టీడీపీకి దిశా నిర్దేశం చేసే రాజకీయ ఘట్టంగా పార్టీ వర్గాలు భావిస్తున్నాయి కడపలో నూతనంగా నిర్మించిన పార్టీ కార్యాలయంలో ఆవరణలో భూపేష్ రెడ్డి తో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులంతా కూడా అదే రోజు ప్రమాణ స్వీకారం చేయనున్నారు కావునకు టిడిపి కుటుంబ సభ్యులు టిడిపి అభిమానులు దేవగుడి కుటుంబ అభిమానులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారన్నారు.

# కనేకల్‌లో వీధి కుక్కల దాడులు

- భయాందోళనలో ప్రజలు
- రోజురోజుకు పెరుగుతున్న దాడులు
- ప్రజా భద్రత ప్రశ్నార్థకం
- ఆవులు - వాటి పిల్లలపై కూడా దాడులు

**కనేకల్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా కనేకల్ గ్రామంలో వీధి కుక్కల దాడులు రోజురోజుకు పెరుగు తుండటంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గత వారం రోజులుగా గ్రామంలోని ప్రధాన వీధులు, పాఠశాలల పరిసరాలు, బస్టాండ్ ప్రాంతాల్లో వీధి కుక్కలు అకస్మాత్తుగా దాడులు చేసి పలువురిని కాటేశాయి. ఈ ఘటనల్లో చిన్నారులు ఎక్కువగా గాయపడటం ఆందోళన కలిగిస్తోంది. కుక్కల దాడుల్లో గాయపడిన వారిని తక్షణమే కనేకల్ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తరలించి యాంటీ రేబీస్ ఇంజెక్షన్లు అందించారు. అయితే చికిత్స కోసం ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. వీధుల్లో చెత్త నిల్వలు, మాంసాహార వ్యర్థాలు అధికంగా ఉండటంతో కుక్కల సంఖ్య పెరిగిందని స్థానికులు ఆరోపిస్తు న్నారు.





ముఖ్యంగా రాత్రి సమయాల్లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు అరుపులతో ప్రజలను భయపెడుతు న్నాయని, బయటకు వెళ్లా లంటేనే భయపడుతు న్నామని గ్రామస్తులు చెబుతున్నారు. పిల్లలను పాఠశాలలకు పంపించాలంటే తల్లిదండ్రులు జంకుతున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పంచాయతీ అధికారులు, సంబంధిత శాఖలు వెంటనే స్పందించి వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. కుక్కల పట్టివేత, శస్త్రచికిత్సలు, టీకాల కార్యక్రమాలను తక్షణమే ప్రారంభించాలని, అలాగే పారిశుధ్యంపై దృష్టి సారించి చెత్తను సక్రమంగా తొలగించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కొనసాగితే గ్రామంలో మరింత ప్రమాదకర పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని, ఏదైనా ప్రాణనష్టం జరిగితే బాధ్యత ఎవరిది అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

మనుషులపైనే కాక ఆవులు మరియు వాటి దూడలపైన కూడా దాడులు చేస్తున్నాయి. గురువారం రాత్రి కణేకల్ తిరుమల డైరీ పక్కన రోడ్డుపై ఒక ఆవు దాని చిన్న దూడను కుక్కలు తరుముతూ, కరిచేందుకు ప్రయత్నించాయి వెంటనే స్థానికులు కుక్కలను తరిమివేశారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి కనేకల్ గ్రామ ప్రజలకు భద్రత కల్పించాలని వారు కోరుతున్నారు.

# పాలిసెట్ ప్రవేశ పరీక్షా కేంద్రంగా పులివెందుల

**పులివెందుల - సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యా మండలి విజయవాడ ఆధ్వర్యంలో పులివెందుల పాలిసెట్ 2026 పరీక్ష కేంద్రంగా నిర్వహించనున్నారు. పులివెందుల, వేంపల్లి, తొండూరు, సింహాద్రిపురం, లింగాల, పార్నపల్లి, ఆర్ఎస్ కొండాపురం, వీరపునాయునిపల్లి చుట్టుపక్కల విద్యార్థులకు సులువుగా మరియు సౌకర్యంగా ఉంటుందన్న నేపథ్యంలో ఇదివరకు ప్రొద్దుటూరు, కడప, తాడిపత్రి, అనంతపురంలోకి వెళ్లి పరీక్ష రాసేవారని సుమారు రెండువేల మంది విద్యార్థులకు పులివెందులలో పరీక్ష రాసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రస్తుతం అహోబిలాపురం స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల మరియు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలను పరీక్ష సెంటర్లుగా పరిశీలిస్తున్నారని, ఈ పరీక్ష నిర్వహించడానికి ప్రభుత్వ పాలిటెక్నిక్ సింహాద్రిపురం ప్రిన్సిపల్ డాక్టర్ ఏ శివశంకర్ ని కోఆర్డినేటర్ గా సాంకేతిక విద్యా మండలి నియమించింది.

# నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- నిధుల మంజూరుపై కలెక్టర్‌కు ఎమ్మెల్యే డా.విజయశ్రీ వినతి
- పెండింగ్ పనులకు తక్షణమే నిధులు మంజూరు చేయాలి
- ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ



**నాయుడుపేట- సూర్య వాస్తవం :** సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఎన్నాళ్లుగానో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు వెంటనే నిధులు మంజూరు చేసి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌ను కోరారు. తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం జరిగిన ఈ భేటీలో, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, తెలుగుదేశం పార్టీ నేత పార్థసారథి తదితరులు ఎమ్మెల్యేతో కలిసి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గంలో రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, వైద్య, విద్యా సదుపాయాలు, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి చేపట్టిన పనులు నిధుల కొరత కారణంగా నిలిచిపోయాయని ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పనులకు తక్షణమే నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన అంశాలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు ఎమ్మెల్యే అందజేశారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వేగవంత మైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాట్లాడిన ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, "సూళ్లూరుపేట నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధే మా లక్ష్యం. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరంతరం పోరాడతాం"అని మాట్లాడుతూ చెప్పారు. కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



# గరుడ వాహనం పై శ్రీ రంగనాథుడు



**పులివెందుల - సూర్య వాస్తవం:** పులివెందుల శ్రీ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీ రంగనాథ స్వామి వారు శ్రీదేవి భూదేవి అమ్మవారులతో కలిసి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని కాయ కర్పూరం సమర్పించి పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారి శ్రీదేవి భూదేవి అమ్మవారితో కలిసి గ్రామ పర్యటన కావించారు. స్వామివారికి శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ అరవీటి నారాయణరెడ్డి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈవో కె.వి రమణ ఆలయ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలు ...!

- అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీష్
- జిల్లా ఎస్పీ చేతుల మీదుగా క్రీడా దుస్తులు పంపిణీ



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం:** పోలీసు అధికారులు శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలందించగలరని జిల్లా ఎస్పీ పి. జగదీష్ అన్నారు. జిల్లా పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ సందర్భంగా శుక్రవారం నాటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న క్రీడా పోటీలకు సంబంధించి పాల్గొనే జట్లకు అవసరమైన టీ షర్ట్స్, లోయర్లు, క్యాప్‌లు సిద్ధం చేయడం జరిగింది. ఈ క్రీడా దుస్తులను జిల్లా ఎస్పీ పి.జగదీష్ చేతుల మీదుగా అందజేశారు. సబ్ డివిజన్ వారీగా పోటీల్లో పాల్గొనే ఆటగాళ్లు, క్రీడాకారులకు ప్రత్యేక డ్రెస్ కోడ్ కేటాయించి, ఆ ప్రకారంగానే దుస్తులు తయారు చేయించగా, వాటిని సంబంధిత సబ్ డివిజన్ల టీం కెప్టెన్లకు ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు జట్టు భావనను, క్రమశిక్షణను పెంపొందిస్తాయని తెలిపారు. జిల్లా పోలీస్ సిబ్బంది క్రీడల్లో చురుకుగా పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, పలువురు సి.ఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )